శ్రీ క్రోధి నామ సంవత్సరం ఉత్తరాయణం - శిశిర ఋతువు మాఘ మాసం - శుక్లపక్షం సూర్యోదయం - ఉ. 6:50 సూర్యాస్తమయం - సా. 6:09 తిథిజి అష్టమి రా. 12:37ం వరకు తరువాత నవమి సంస్కృత వారం సౌమ్య వాసరః నక్షత్రం భరణి రా. 8:34 వరకు తరువాత కృతిక యోగం శుక్ల రా. 9:12 వరకు కరణం విష్టి మ. 1:33 వరకు బవ రా. 12:37ం వరకు వర్జ్యం ఉ. 6:54 నుండి ఉ. 8:25 వరకు దుర్ముహూర్తం మ. 12:07 నుండి మ. 12:52 వరకు రాహుకాలం మ. 12:30 నుండి మ. 1:55 వరకు యమగండం ఉ. 8:15 నుండి ఉ. 9:40 వరకు గుళికాకాలం ఉ. 11:05 నుండి మ. 12:30 వరకు బ్రహ్మముహూర్తం తె. 5:14 నుండి ఉ. 6:02 వరకు అమృత ఘడియలు మ. 3:59 నుండి సా. 5:30 వరకు అభిజిత్ ముహూర్తం లేదు

e-paper

# ఈ-కబురు

ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం


స్టార్ హీరోతో ఛాన్స్.. మరోసారి ఐటమ్ సాంగ్‌లో శ్రియ

సినీ కబుర్లు




బుధవారం | 5-2-2025 | హైదరాబాద్ | e-kaburu.com


# పకడ్బంధీగా కులగణన నిర్వహించాం

- 75 అంశాల ప్రాతిపదికగా సర్వే
- మొత్తం 1.12 కోట్ల కుటుంబాల సర్వే
- గ్రామాల్లో: 66.39 లక్షల కుటుంబాలు
- పట్టణాల్లో: 45.15 లక్షల కుటుంబాలు
- రూ.161 కోట్ల వ్యయంతో కుల గణన సర్వే పూర్తి
- బీసీలకు అవకాశాలు కల్పించేందుకు స్పష్టమైన లెక్కలు
- 76,000 డేటా ఎంట్రీ ఆపరేటర్లు, 36 రోజులపాటు కృషి
- కులగణనను మోడల్ డాక్యుమెంట్‌గా ప్రకటించిన సీఎం
- వెనుకబడిన వర్గాల అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వ ప్రక్రియ
- అన్ని పార్టీల నుంచి అభినందనలు రావాలని సీఎం విజ్ఞప్తి
- దేశానికి ఆదర్శంగా నిలిచేలా నివేదిక రూపకల్పన

అసెంబ్లీలో నివేదిక ప్రవేశపెట్టిన సీఎం రేవంత్ రెడ్డి



*పకడ్బంధీగా కులగణన నిర్వహించామని.. ఇందు కోసం రూ.161 కోట్లు ఖర్చు చేసి సర్వే చేశామని. ఇది ఒక మోడల్ డాక్యుమెంట్‌గా పనిచేస్తుందని, పూర్తిస్థాయి చట్టబద్ధత కల్పించేందుకు కేబినెట్ ఆమోదం తరువాత సభలో ప్రవేశపెట్టటం జరిగిందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. తెలంగాణ అసెంబ్లీ ప్రత్యేక సమావేశంలో కులగణన, ఎస్సీ వర్గీకరణ నివేదికలపై చర్చ లో సీయం రేవంత్ పలు విషయాలు వెల్లడించారు.. సామాజిక, ఆర్థిక సర్వే నివేదికలు ఉభయ-సభల ముందుకు తీసుకురావడం జరిగిందన్నారు.*

**ఈ-కబురు, హైదరాబాద్**

ఫిబ్రవరి 04 : తెలంగాణ సామాజిక ఆర్థిక విద్య ఉపాధి రాజకీయ కులగణన రిపోర్ట్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. సామాజిక, ఆర్థిక, ఉపాధి, విద్య, కులసర్వే నివేదిక సమగ్ర ఇంటింటి కులసర్వే నిర్వహించాలని 2024 ఫిబ్రవరిలో ప్రభుత్వ నిర్ణయం తీసుకుందన్నారు. బీసీ లెక్కలు తేల్చి వారికి అవకాశాలు కల్పిస్తామని రాహుల్ గాంధీ పాదయాత్రలో హామీ ఇచ్చారని.. రాహుల్ గాంధీ ఇచ్చిన మాట ప్రకారం మేము కుల గణన చేపట్టామన్నారు. మంత్రి ఉత్తమ్ నేతృత్వంలో కమిటీ వేసి ప్రక్రియను ముందుకు తీసుకువెళ్ళామని తెలిపారు. కర్నాటక, బిహార్ సహా వివిధ సర్వేలను అధ్యయనం చేశామని తెలిపారు. వెనుకబడిన వర్గాల అభ్యున్నతి కోసం సర్వే చేపట్టామని చెప్పారు. తెలంగాణ వ్యాప్తంగా ఈ సర్వేను నిర్వహించామన్నారు. సర్వేల తయారీలో వివిధ సంఘాలు, మేధావుల అభిప్రాయాలు తీసుకున్నామని.. 75 అంశాల ప్రాతిపదికగా సర్వేను నిర్వహించామని చెప్పారు. నవంబర్ 9 నుంచి 50 రోజుల పాటు సర్వే నిర్వహణ జరిగిందని తెలిపారు. తెలంగాణలో 1.12 కోట్ల కుటుంబాల సర్వే జరిగిందని వెల్లడించారు. పట్టణాల్లో 45.15 లక్షల కుటుంబాల్లో సర్వే జరుగగా.. గ్రామాల్లో 66.39 లక్షల కుటుంబాల్లో సర్వే జరిగిందన్నారు. కులసర్వే డేటాను సంక్షేమ విధానాల తయారీకి వాడుతామని సీఎం తెలిపారు. (మిగతా 2 వ పేజీలో)



# లోక్‌సభలో రాహుల్‌పై మోదీ విమర్శలు!

- "పేదలతో ఫోటో సెషన్ - సభలో ముఖం చాటేయడం"
- వికసిత్ భారత్ మా లక్ష్యం-25 కోట్ల మంది పేదరికం నుంచి బయట
- కాంగ్రెస్ హామీలు నెరవేర్చలేదు - తప్పుడు హామీలతో యువతను మోసం
- "బీజేపీ హయాంలో అవినీతి రహిత పాలన"
- "నగదు బదిలీ ద్వారా ప్రజలకు నేరుగా లబ్ధి"
- "భారత్ ప్రపంచ గేమింగ్ రాజధానిగా మారుతోంది"
- "రాజ్యాంగ విలువలే బీజేపీకి ప్రాణం - కాంగ్రెస్ నేతల లగ్జరీ జీవనం"

**ఈ-కబురు,ఢిల్లీ**

ఫిబ్రవరి 04 : రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగంలో పసలేదంటేంటూ సోనియా, అందుకు వంత పాడిన రాహుల్ గాంధీపై ప్రధాని మోదీ లోక్‌సభలో పరోక్షంగా స్పందించారు. లోక్‌సభ బడ్జెట్ సమావేశాల సందర్భంగా రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై చర్చకు మోదీ ప్రసంగిస్తూ.. కొంతమంది నేతలు పేదలతో ఫొటో సెషన్ చేస్తారు. సభలో అదే పేదల గురించి మాట్లాడితే ఆ నేతలే ఫేస్‌ని విసుగ్గా పెడతారంటూ..కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీపై ప్రధాని విమర్శలు గుప్పించారు. (మిగతా 2 వ పేజీలో)



## సామాజిక న్యాయానికి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉంది

మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి 2



## ఎస్సీ వర్గీకరణను సమర్థిస్తున్నాం

తెలంగాణ అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణపై కేటీఆర్ స్పష్టీకరణ

ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకం అని ఎవరూ భావించొద్దు 2



## మాజీ సీఎం కేసీఆర్‌కు ప్రధాని మోడీ లేఖ..

సోదరి మరణంపై సంతాప సందేశం 3



# ఇల్లీగల్ బిల్డింగ్స్..లీగల్‌గా మారుతున్న బ్లాక్ మనీ

## అయ్యప్ప సొసైటీలో నల్లధనం ప్రవాహం

## అక్రమ నిర్మాణాలతో బ్లాక్ మనీని సక్రమం చేసుకుంటున్న బడాబాబులు

" మీ దగ్గర బ్లాక్ మనీ ఉందా... నయా పైసా ఖర్చు కాకుండా బ్లాక్ మనీని వైట్ చేసుకోవాలనుకుంటున్నారా... ఇదుగో ఇక్కడ పెట్టుబడి పెట్టండి... అదనంగా పైసా ఖర్చు లేకుండా మీ అక్రమ డబ్బు మొత్తం సక్రమంగా మారుతుంది... ఐటీ కారిడార్ నడిబొడ్డున బ్లాక్ మనీతో ఒక్క అక్రమ నిర్మాణం చేపడితే చాలు... మీరు వద్దన్నా నెలనెలా మీ డబ్బు వైట్ గా మారి వచ్చి మీ అకౌంట్‌లో పడుతుంది...ఏంటీ ఈదేమైన ప్రమోషనల్ న్యూస్ అనుకుంటున్నారా.. అస్సలు కాదు.. ప్రస్తుతం ఐటీ కారిడార్ నడిబొడ్డున నడుస్తున్న గోల్ మాల్ బాగోతం ఇది.



**ఈ-కబురు, శేరిలింగంపల్లి :**

ఫిబ్రవరి 04 : మాదాపూర్ అయ్యప్ప సొసైటీ కేంద్రంగా కొనసాగుతున్న నయా లావాదేవీ. అక్రమ నిర్మాణం అంటే బల్దియా యంత్రాంగం అడ్డుకోదా అనే అనుమానం అవసరమే లేదు. వారికి ఇచ్చుకోవలసింది (అదీ బ్లాక్ లోనే) ఇస్తే యథేచ్ఛగా నిర్మాణం చేసుకోవచ్చు. నిర్మాణం పూర్తవడమే తరువాయి, మీ డబ్బంతా అద్దెల రూపంలో వైట్ గా వచ్చి మీ అకౌంట్లలో చేరుతుంది."మాదాపూర్ అయ్యప్ప సొసైటీ బ్లాక్ మనీని సక్రమం చేసుకునే కేంద్రంగా మారిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. శేరిలింగంపల్లి మండల పరిధిలోని మాదాపూర్ హైటెక్ సిటీ నడి బొడ్డున ఉన్న గురుకుల్ ట్రస్ట్ భూముల్లో ఎటువంటి రిజిస్ట్రేషన్లకు ఆస్కారం లేదు.

(మిగతా 2 వ పేజీలో)







మెస్సీ కాదు!.. నేను అత్యుత్తమ ఆటగాడిని

రొనాల్డో

ఆట



లాభాల్లో స్టాక్‌మార్కెట్లు

బిజినెస్

# సామాజిక న్యాయానికి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉంది

- సామాజిక-ఆర్థిక, విద్య, ఉద్యోగ, రాజకీయ కుల గణన సర్వే పూర్తి
- 3.54 లక్షల మందిని వ్యక్తిగతంగా కలిసి వివరాల సేకరణ
- 1,03,000 మంది ప్రభుత్వ ఉద్యోగులు, 76,000 డేటా ఎంట్రీ ఆపరేటర్లతో సర్వే
- 160 కోట్ల రూపాయల వ్యయంతో 2025 ఫిబ్రవరి నాటికి పూర్తి
- కేంద్రాన్ని ఒప్పించి రిజర్వేషన్లను ఆమోదింపజేయాలని బీజేపీకి సూచన
- కాంగ్రెస్ పార్టీ బి.సి, ఎస్.సి, ఎస్.టి, మైనారిటీ అభివృద్ధికి కట్టుబడి ఉందని స్పష్టం
- బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఇలాంటి సర్వే ఎందుకు జరగలేదో వివరణ ఇవ్వాలని డిమాండ్



**ఈ-కబురు, హైదరాబాద్**

ఫిబ్రవరి 04 : సామాజిక న్యాయానికి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.కాంగ్రెస్ పార్టీ అధినేత,లోకసభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ స్ఫూర్తితో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం సామాజిక ఆర్థిక,విద్య, ఉద్యోగ,రాజకీయ కులగణన సర్వే నిర్వహించిందని ఆయన తెలిపారు.మంగళవారం రోజున రాష్ట్ర శాసన సభలో సామాజిక ఆర్థిక విద్య ఉద్యోగ రాజకీయ కుల గణనపై జరిగిన చర్చలో బిజెపి కి చెందిన సభ్యుడు పాయల శంకర్ లేవనెత్తిన సందేహాలపై ఆయన తీవ్రంగా స్పందించారు. సామాజిక ఆర్థిక,విద్య,ఉద్యోగ, రాజకీయ, కులగణనసర్వే భారీ స్థాయిలో జరిగిన కసరత్తు అని క్రమశిక్షణతో నిబద్ధతతో నిర్వహించామని ఆయన అన్నారు. అంకెల గారడీతో అనవసరంగా ప్రజల్లో అపోహలు, అనుమానాలు సృష్టించవద్దని ఆయన విపక్షాలకు హితవు పలికారు. అప్పటి టి.ఆర్.యస్/బి.ఆర్.ఎస్ ప్రభుత్వం నిర్వహించిన సమగ్ర సర్వేలో ఓ.సి ల శాతం 21% ఉండగా అది ఇప్పుడు 15% నికి తగ్గిందన్నారు.అదే విదంగా అదే సమగ్ర సర్వేలో బి. సి ల శాతం 51% ఉండగా అది తాజాగా నిర్వహించిన సర్వేలో బి.సి ల శాతం 56% నికి పెరిగిందన్నారు.గణాంకాలు ఇంత స్పష్టంగా ఉంటే ప్రజల్లో గందరగోళం సృష్టించేందుకే విపక్షాలు రాద్ధాంతం చేస్తున్నారన్నారు.సద్విమర్శలను హుందాగా స్వీకరించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని,తప్పులు గుర్తిస్తే సరిదిద్దుకోవడంలో వెనకకు పోమని ఆయన తేల్చి చెప్పారు. ప్రతిపక్షాలకు అనుమానాలు ఉంటే ప్రజెంటేషన్ ద్వారా నివృత్తి చెయ్యడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారుఈ తరహాసామాజిక ఆర్థిక,విద్య,ఉద్యోగ, రాజకీయ, కులగణనసర్వే యావత్ భారతదేశంలో ఎక్కడా జరగలేదన్నారు. కొత్తగా ఏర్పడ్డ తెలంగాణా రాష్ట్రాన్ని పదేళ్ల పాటు పాలించిన పార్టీ ఈ ఊసే ఎత్తలేదన్నారు. ప్రధాని మోడీతో సహా బిజెపి పాలిత రాష్ట్రాలలో సామాజిక ఆర్థిక,విద్య,ఉద్యోగ,రాజకీయ,కులగణన సర్వే ఎందుకు నిర్వహించలేదో అన్నది ఇక్కడి బిజెపి నాయకులు రాష్ట్ర ప్రజలకు వివరణ ఇవ్వాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి డిమాండ్ చేశారు. మూడు కోట్ల 70 లక్షలున్న రాష్ట్ర జనాభాలోసామాజిక ఆర్థిక, విద్య, ఉద్యోగ,రాజకీయ,కులగణన సర్వే బృందం 3.54 లక్షల మందిని వ్యక్తిగతంగా కలిసి వివరాలు సేకరించినట్లు ఆయన వివరించారు. 150 ఇండ్లకు యూనిట్ చొప్పున మార్కింగ్ చేసి ప్రభుత్వ ఉద్యోగులకు శిక్షణ ఇచ్చిసామాజిక ఆర్థిక,విద్య,ఉద్యోగ, రాజకీయ, కులగణనసర్వే నిర్వహించినట్లు ఆయన వెల్లడించారు. ప్రతి మందికి ఒక సూపర్ వైజర్‌ను నియమించి ఈ ప్రక్రియ పూర్తి చేశామన్నారు.మొత్తం ఈ సర్వేలో లక్షా మూడు వేల మంది ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొన్నార న్నారు.అంతే గాకుండా 76 వేల మంది డేటా ఎంట్రీ ఆపరేటర్లు రాత్రి పగుల్లు శ్రమించి సృష్టించిన చారిత్రాత్మక ఘట్టం ఇది అన్నారు.4 ఫిబ్రవరి 2024 న మొదలు పెట్టిన ఈ ప్రక్రియ సరిగ్గా సంవత్సరం తిరిగేసరికి అంటే 4 ఫిబ్రవరి 2025 నాటికి 160 కోట్ల ఖర్చు చేసి పూర్తి చేసిన ఘనత ముమ్మాటికీ రాష్ట్ర ప్రభుత్వానికె దక్కుతుందన్నారు. బి.సి,ఎస్.సి, ఎస్.టి మైనారిటీల అభ్యున్నతికి కాంగ్రెస్ పార్టీ చిత్తశుద్ధితో పనిచేస్తుందన్నారు.అటువంటి మా చిత్తశుద్ధిని శంకించవద్దన్నారు.సామాజిక ఆర్థిక,విద్య,ఉద్యోగ,రాజకీయ,కులగణనసర్వే భారతదేశ చరిత్రలోనే సరికొత్త అధ్యాయంగా ఆయన అభివర్ణించారు. సర్వేనసురించి రిజర్వేషన్లకొరకు రాష్ట్ర శాసనసభ ద్వారా తీర్మానం చేసి కేంద్రానికి నివేదిద్దామని ఆయన విపక్షాలకు పిలుపునిచ్చారు.ఇక్కడి బిజెపి నేతలు కేంద్రాన్ని ఒప్పించి ఆమోదింప చెయ్యాలని ఆయన బిజెపి సబ్యులకు సూచించారు.ప్రభుత్వ చిత్త శుద్ధిని శంకించి ప్రజల్లో తప్పుడు సమాచారంతో అపోహలు అనుమానాలు సృష్టించ వద్దన్నారు.

# వర్గీకరణ వల్ల ఎవరి ప్రయోజనాలకు ఇబ్బంది కలగదు



**ఈ-కబురు, హైదరాబాద్**

ఫిబ్రవరి 04 : ఎస్సీ వర్గీకరణ వల్ల ఎవరి ప్రయోజనాలకు ఇబ్బంది కలగదు అని మంత్రి దామోదర రాజనర్సింహా స్పష్టం చేశారు. మంగళవారం ఆయన అసెంబ్లీలో మాట్లాడుతూ.. 30, 40 ఏళ్ల కల నేడు సాకారం అవుతోందని అన్నారు. 30 ఏళ్ల ఉద్యమానికి నేడు పరిష్కారం దొరికిందని తెలిపారు. వర్గీకరణ ఏ వర్గానికి వ్యతిరేకం కాదు. వర్గీకరణ వల్ల ఎవరి ప్రయోజనాలకు ఇబ్బంది కలగదని మంత్రి దామోదర భరోసా ఇచ్చారు. అంతకుముందు ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు అమలుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.కోర్టు తీర్పు అమలు కోసం ఏకసభ్య కమిషన్ వేశామని తెలిపారు. ఎస్సీ వర్గీకరణపై అసెంబ్లీలో ముఖ్యమంత్రి ప్రకటన చేశారు. ఎందరో ముఖ్యమంత్రులకు రాని అవకాశం నాకు వచ్చింది. చాలా రాజకీయ పార్టీలు ఎస్సీ వర్గీకరణ అంశాన్ని ఓటు బ్యాంకుగా చూశాయి తప్ప.. ఆ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించే ప్రయత్నం చేయలేదు. అందుకే ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించడం ద్వారా సమాజంలో తరతరాలుగా నిర్లక్ష్యానికి, దోపిడీకి గురైన వారికి న్యాయం చేయాలని సంకల్పించాం.

వర్గీకరణకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని కోరుతున్నా అని రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

# పకడ్బంధీగా కులగణన నిర్వహించాం



(మొదటి పేజీ తరువాయి)

విద్యా ఉద్యోగ ఉపాధి రాజకీయ అవకాశాలు కల్పించడానికి సర్వే పని చేయాలన్నారు. పార్టీలకు అతీతంగా ప్రభుత్వాన్ని అన్ని పార్టీలు అభినందించాలని ముఖ్యమంత్రి అన్నారు. ప్రతీ గ్రామంలో, తండాల్లో ఎన్యూమరేటర్లు పకడ్బందీగా వివరాలు సేకరించారని తెలిపారు. ప్రతీ 150 ఇండ్లను ఒక యూనిట్‌గా గుర్తించి ఎన్యూమరేటర్లను కేటాయించి వివరాలు సేకరించామని 76 వేల మంది డేటా ఎంట్రీ ఆపరేటర్లు 36 రోజులు కష్టపడి ఈ నివేదికను రూపొందించారని చెప్పారు. 56 శాతం ఉన్న బీసీలకు సముచిత గౌరవం కల్పించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. దేశానికి ఆదర్శంగా నిలిచేలా నివేదికను రూపొందించడానికి కృషి చేసిన అందరికీ ముఖ్యమంత్రి అభినందనలు తెలియజేశారు. ముఖ్యమంత్రి ప్రసంగిస్తున్న సమయంలో అధికార పార్టీ సభ్యులు హర్షధ్వానాలు వ్యక్తం చేశారు.

# లోక్‌సభలో రాహుల్‌పై మోదీ విమర్శలు!



(మొదటి పేజీ తరువాయి)

నాలుగోసారి దేశ ప్రజలు మమ్మల్ని ఆశీర్వదించారు. నాలుగో సారి దేశ ప్రజలు నన్ను ఆశీర్వదించారు. వికసిత్ భారత్ మా లక్ష్యం.10ఏళ్లలో 25కోట్ల మంది ప్రజలు పేదరికాన్ని జయించారు. వికసిత్ భారత్ సాధనే మా లక్ష్యం. రాష్ట్రపతి ప్రసంగం మాలో ఆత్మవిశ్వాసం నింపింది. ప్రజల సొమ్మును ప్రజలకే ఉపయోగిస్తాం. ప్రజల కష్టాలు తెలిసిన వారికే అభివృద్ధి సాధ్యమవుతుంది. నాలుగు కోట్ల మందికి పక్కా ఇళ్లు నిర్మించాం. 12 కోట్లకు పైగా మరుగుదొడ్లు కట్టించాం. ఐదేళ్లలో 12 కోట్ల మందికి మంచినీటి సౌకర్యం కల్పించాం. మధ్య తరగతి ప్రజల ఆకాంక్షలు నెరవేర్చే అవకాశం ఉంది. ఎన్నికల్లో మేం ఏ ఒక్క తప్పుడు హామీ ఇవ్వలేదు. కాంగ్రెస్ ఇచ్చిన హామీల్ని నెరవేర్చలేదని మండిపడ్డారు.

కొందరు శీష్‌మహల్ కోసం అవినీతి చేస్తారు.ఇప్పుడు నగదు బదిలీద్వారా ప్రజలకు నేరుగా నగదు అందుతుంది.మౌలిక వసతుల కల్పనకు బడ్జెట్‌లో ప్రాధాన్యం. గత ప్రభుత్వాలు గరీబీ హఠావో అంటూ స్లోగన్లు మాత్రమే ఇచ్చేవి. మేం 25కోట్ల మందిని పేదరికం నుంచి బయటపడేంశాం. రాష్ట్ర ప్రసంగం కొంతమందికి బోర్‌గా అనిపించింది. బీజేపీ పాలనలో ఎలాంటి స్కాం జరగలేదు. మా హయాంలో దేశంలో అవినీతి రహిత పాలన అందిస్తున్నాం.

గతంలో స్కాంలు గురించి వినేవాళ్లం. కానీ ఇప్పుడు స్కాంలు లేవు. కేవలం అభివృద్ధి గురించి మాట్లాడుకుటుంటున్నాం. ప్రపంచ గేమింగ్ రాజధానిగా భారత్ మారుతోంది. కొన్ని పార్టీలు ఎన్నికల వేళ హామీలు ఇస్తున్నాయి. తప్పుడు హామీలు ఇచ్చి యువతను మోసం చేస్తోంది. ప్రలోభాలకు గురిచేస్తోంది. అందుకే హర్యానాలో బీజేపీని మూడోసారి గెలిపించారు. ఎన్నికల్లో బీజేపీ ప్రజలకు ఇచ్చిన హామీల్ని తప్పకుండా నెరవేర్చుంతుంది. రాజ్యంగం అంటే బీజేపీకి ప్రాణం. రాజ్యంగం విలువలకు ప్రాధాన్యం ఇస్తుంది.

కొందరు నేతలు లగ్జరీగా ఉండాలని అనుకుంటారు. ఖరీదైన షవర్లు, బాత్‌టబ్‌లు కొనుగోలు చేస్తారు. అలాంటి వారికి పేదల గరించి ఏం తెలుస్తోంది. కొంతమందికి బంగ్లాలు కొనుగోలు చేయడంపైనే ఫోకస్ చేస్తారు. మేం ఇంటింటికి నల్లాలు ఇచ్చే దానిపై ఫోకస్ పెట్టాం" అని వ్యాఖ్యానించారు.

# ఎస్సీ వర్గీకరణను సమర్థిస్తున్నాం



**బీఆర్ఎస్ పార్టీ ఎప్పటి నుంచో వర్గీకరణకు మద్దతు**

**2001 నుంచి ఎస్సీ వర్గీకరణపై స్పష్టమైన వైఖరి**

**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్: కేటీఆర్**

**ఈ-కబురు, హైదరాబాద్**

ఫిబ్రవరి 04 : రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణను సమర్థిస్తున్నామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత ఎస్సీ వర్గీకరణకు మద్దతుగా అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మానం చేసి కేంద్రానికి పంపించామని కేటీఆర్ గుర్తు చేశారు. అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణపై కేటీఆర్ మాట్లాడారు.సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుకు అనుగుణంగా రాష్ట్రం ప్రభుత్వం ఏకసభ్య కమిషన్ చేసిన సిఫారసులను సభలో ప్రవేశపెట్టింది. అయితే ఈ రోజు కాదు.. మొదటి నుంచి ప్రజాస్వామిక ఉద్యమంగా, మలిదశ ఉద్యమానికి నాయకత్వం వహించిన పార్టీగా.. బీఆర్ఎస్ పార్టీ ఎస్సీ వర్గీకరణకు సంపూర్ణ మద్దతు ఇస్తూ వచ్చింది. ఎస్సీ వర్గీకరణ విషయంలో 2001 నుంచి స్పష్టంగా ఉన్నామని కేటీఆర్ స్పష్టం చేశారు.అస్థిత్వ ఉద్యమానికి నాయకుడిగా, ప్రజల ఆకాంక్షలను, సంపూర్ణంగా అర్థం చేసుకున్న నాయకుడిగా కేసీఆర్ ఎస్సీ వర్గీకరణకు మద్దతు ఇచ్చారు. ఆనాడు మరొక అస్థిత్వ ఉద్యమానికి నాయకత్వం వహిస్తున్న మందకృష్ణ మాదిగను తప్పకుండా ఈ సభలో గుర్తు చేసుకోవాలి. ఎస్సీ వర్గీకరణకు మద్దతుగా ఎమ్మార్పీఎస్, టీఎమ్మార్పీఎస్, ఇతర సంఘాలు, సంస్థలు, వ్యక్తులు చేసిన పోరాటానికి కేసీఆర్ అండగా నిలబడ్డారు. కానీ వర్గీకరణ విసయంలో వారు పోరాడితే మేం అడ్డుకున్నట్టు చిత్రీకరించే ప్రయత్నం చేశారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత సీఎంగా కేసీఆర్.. 2014 నవంబర్ 29న దీక్షా దివస్ సందర్భంగా ఇదే శాసనసభలో వర్గీకరణపై తీర్మానాన్ని ప్రవేశపెట్టి కేంద్రానికి పంపించారు. అవసరమైతే రాజ్యాంగ సవరణ చేసి ఎస్సీ వర్గీకరణకు నడుం బిగించండి అని ఏకగ్రీవ తీర్మానం చేసి కేంద్రానికి పంపించారు. కేవలం తీర్మానం చేసి చేతులు దులపుకోలేదు. అప్పటి ప్రధాని మోదీని కలిసి ఎస్సీ వర్గీకరణ విషయంలో ఇది మా చిత్తశుద్ధి అని తీర్మానం కాపీ నేరుగా అందజేశారు. ఈ ఘనత కేసీఆర్‌కు మాత్రమే దక్కుతుందన్నారు కేటీఆర్.బీఆర్ అంబేద్కర్ గొప్ప మాట అన్నారు. అదేంటంటే.. సామాజిక స్వేచ్ఛ అనేది లేకపోతే చట్టం ద్వారా సంక్రమించిన హక్కు ఏదైనా వ్యర్థం, నిరర్థకం అని అన్నారు. ఎస్సీ వర్గీకరణ పోరాటంలో నిజాయితీని గుర్తించి ప్రతిపక్షంలో ఉన్నా.. అధికారపక్షంలో ఉన్నా ఎస్సీ వర్గీకరణకు మద్దతు ఇచ్చాం. గాంధీ భవన్ వద్ద ఎమ్మార్పీఎస్ పోరాటంలో అమరులైన కుటంబాలను కేసీఆర్ ఆదుకున్నారు. సుప్రీంకోర్టులో 10 ఏండ్ల పాటు ఇంప్లీడ్ అయి గట్టిగా వాదించారు. ఆ ప్రయత్నం మా ప్రభుత్వ హయాంలో కూడా బలంగా చేశామని కేటీఆర్ తెలిపారు.

# ఇల్లీగల్ బిల్డింగ్స్..లీగల్‌గా మారుతున్న బ్లాక్ మనీ

(మొదటి పేజీ తరువాయి)

గురుకుల్ భూముల్లోని అయ్యప్ప సొసైటీపై దశాబ్దాలుగా వివాదం నడుస్తుండగా, జిహెచ్ఎంసి పట్టణ ప్రణాళిక విభాగం ఏ విధమైన నిర్మాణ అనుమతులు ఇక్కడ ఇవ్వడం లేదు. ఇక్కడి స్థలాల చుట్టూ చిన్న గోడ కట్టడం కూడా అక్రమమే. ఎవరైనా నిర్మాణం చేపట్టాలని చూస్తే చట్టప్రకారం ప్రారంభ దశలోనే గ్రేటర్ యంత్రాంగం అడ్డుకోవాలి. నోటీసులు ఇచ్చి కూల్చివేయాలి. కానీ ఎటువంటి అనుమతి లేని గురుకుల్ ట్రస్టు భూముల్లో జీరో పర్మిషన్ తో భారీ బహుళ అంతస్థుల నిర్మాణాలు కొనసాగుతున్నాయి. మాదాపూర్ ఐటీ కారిడార్ పరిధిలో ఉన్న ఈ ప్రాంతంలో అద్దెలు, ప్రైవేట్ హాస్టళ్లకు భారీ డిమాండ్ ఉంది. దీంతో కొంతమంది బడా బాబులు తమ నల్లధనాన్ని ఇక్కడ పెట్టుబడిగా పెట్టి, అధికారుల అండదండలతో నిర్మాణాలు చేపడుతున్నారు. నిర్మాణ అనుమతి కోసం జీహెచ్ఎంసీకి నయా పైసా చెల్లించకుండా ఏకంగా 7,8 అంతస్థుల భారీ నిర్మాణాలు చేపడుతున్నారు.

**బ్లాక్ ను వైట్ గా మారుస్తున్న నిర్మాణాలు...**

రిజిస్ట్రేషన్లు నిషేధం కావడంతో ఇక్కడ నిర్మిస్తున్న అపార్టుమెంట్లలో ప్లాట్లు అమ్మే అవకాశం లేదు. ఇక్కడ చేపట్టే నిర్మాణాలకు గ్రేటర్ నుంచి అనుమతులు ఉండవు, బ్యాంకుల నుంచి లోన్లు రావు, బహుళ అంతస్థుల నిర్మాణాలు చేపడితే అపార్టుమెంట్ ప్లాట్లు అమ్ముడు పోవు, రిజిస్ట్రేషన్లు కావు. కేవలం అద్దెలకు మాత్రం ఇవ్వవచ్చు. తమ వద్ద ఉన్న బ్లాక్ మనీని ఇక్కడ పెట్టుబడిగా పెట్టి, నెలవారి అద్దెలతో వైట్ గా మార్చుకునేందుకు కొందరు బడా బాబులు నిర్మాణాలు చేపడుతున్నారు. అనుమతే లేని నిర్మాణాల మీద పెట్టుబడి అక్రమమే. కానీ నిర్మాణం పూర్తయిందంటే హాస్టళ్లు, వాణిజ్య సముదాయాలకు అద్దెకు ఇచ్చి, నెలనెలా రెంటల్ ఇన్కమ్ ను చూపించి వైట్ గా సక్రమం చేసుకుంటున్నారు. బడాబాబులు అందిస్తున్న మాముళ్లకు అలవాటుపడిన టౌన్ ప్లానింగ్ అధికారులు సైతం అయ్యప్ప సొసైటీ, గురుకుల్ ట్రస్టు భూముల్లో నిర్మాణాలను ప్రోత్సహిస్తూ తమ జేబులు నింపుకుంటున్నారు. అధికారుల అండ పుష్కలంగా ఉండడంతో ప్రస్తుతం గురుకుల్ భూముల్లోహాయిథేచ్ఛగా నిర్మాణాలు కొనసాగుతున్నాయి.

**తూతుమంత్రంగా చర్యలు...**

గురుకుల్ ట్రస్టు భూముల్లో చేపడుతున్న అక్రమ నిర్మాణాలపై అధికారులు చర్యలు తీసుకోవడంలో పూర్తిగా విఫలం అవుతున్నారు. ప్రభుత్వాలు మారినప్పుడు, కొత్త అధికారులు బాధ్యతలు తీసుకున్నప్పుడు అయ్యప్ప సొసైటీ అక్రమ నిర్మాణాలు హాట్ టాపిక్ అవుతుంటాయి. ఎక్కడ లేని హడావుడి చేసి తూతూ మంత్రంగా కొన్ని నిర్మాణాలను పాక్షికంగా కూల్చివేస్తారు. తాము ఎంపిక చేసుకున్న భవనాల స్లాబులకు ఒకటీ, రెండు రంధ్రాలు వేయడం, నోటీసుల పేరు చెప్పి కాలయాపన చేస్తుంటారు. అనంతరం షరా మాములే. కొన్ని రోజుల క్రితం ఇక్కడ ఓ భవనాన్ని నేలమట్టం చేసిన హైడ్రా కమిషనర్ రంగనాథ్ సైతం అయ్యప్ప సొసైటీలో చేపడుతున్న నిర్మాణాలు మొత్తం అక్రమామే అని తేల్చినా ఇక్కడ అక్రమ నిర్మాణాలు మాత్రం ఆగడం లేదు.







## తెలంగాణ సచివాలయానికి
# బాంబు బెదిరింపులు

**ఈ-కబురు,హైదరాబాద్**

ఫిబ్రవరి 04 : తెలంగాణ సచివాలయానికి బెదిరింపు కాల్ వచ్చింది. సెక్రటరియేట్‌ను బాంబుపెట్టి పేల్చేస్తాంమంటూ అగంతకుడు సీఎం రేవంత్‌రెడ్డి పీఆర్ఓపీకి ఫోన్ చేశాడు. బెదిరింపులతో అప్రమత్తమైన ఎస్పీఎఫ్ పోలీసులు తెలంగాణ సెక్రటరియేట్‌లో తనిఖీలు నిర్వహించారు. సచివాలయంలో ఎలాంటి బాంబు లేదని తేల్చి చెప్పారు. మూడు రోజుల నుంచి అగంతకుడు బెదిరింపు కాల్స్ చేశాడు.

అగంతకుణ్ని అదుపులోకి తీసుకున్న పోలీసులు .. ఎందుకు బెదిరింపు కాల్స్ చేశాడన్న కోణంలో దర్యాప్తు చేపట్టారు.



# స్వీడన్‌లో కాల్పుల కలకలం..

### 10 మంది మృతి

**ఈ-కబురు,స్టాక్‌హోమ్**

ఫిబ్రవరి 04 : యూరప్ దేశం స్వీడన్‌లో కాల్పుల కలకలం చోటుచేసుకుంది. ఒరెబ్రో నగరంలోని ఓ అడల్ట్ ఎడ్యుకేషన్ సెంటర్‌లో కాల్పులు జరిగాయి. ఈ ఘటనలో అనుమానితునితో సహా 10 మంది చనిపోయినట్లు పోలీసులు వెల్లడించారు. పలువురు గాయపడి ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. కాల్పులు ఘటనతో ఒక్కసారిగా ఆ ప్రాంతమంతా ఉలిక్కి పడింది. వెంటనే భారీ ఎత్తున భద్రతా బలగాలు చేరుకొని సహాయ చర్యలు చేపట్టాయి. అంబులెన్స్‌లు, అత్యవసర వాహనాలు మోహరించాయి. నష్టం భారీ ఎత్తున ఉండవచ్చని మీడియాలో కథనాలు ప్రసారమవుతున్నాయి. స్వీడన్ చరిత్రలోనే అతిపెద్ద ఘటనల్లో ఇదొకటని చెబుతున్నారు. అత్యంత భయంకరమైన ఘటన పోలీసు అధికారి పేర్కొన్నారు.

రాజధాని స్టాక్‌హోమ్‌కు 200 కి.మీ దూరంలో ఉన్న ఒరెబ్రోలో ఈ కాల్పులు జరిగాయి. ఈ ఘటనకు కారణమైన నిందితుడు గతంలో నేరస్థుడు కావచ్చని పోలీసులు భావిస్తున్నారు. ఈ కాల్పుల ఘటనకు ఒక్కడే పాల్పడినట్టు ట్లు పోలీసులు పేర్కొన్నారు. కాల్పులు జరిపిన అనంతరం దుండగుడు తనను తాను కాల్చుకున్నట్లు స్థానిక మీడియా వర్గాలు తెలిపాయి. రిస్‌బెర్గ్‌స్కా స్కూల్ క్యాంపస్‌లో 20 ఏళ్లు పైబడిన విద్యార్థులు ఇక్కడ చదువుకుంటారు. ప్రాథమిక, అప్పర్ ప్రైమరీ, వలసదారులకు, మానసిక దివ్యాంగులకు ఇక్కడ పాఠాలు బోధిస్తారు. అయితే ఇది ఉగ్రదాడి కాకపోవచ్చని పోలీసులు తెలిపారు. ఈ ఘటన సమయంలో క్యాంపస్‌లో చాలా తక్కువ సంఖ్యలో విద్యార్థులు ఉన్నారని పాఠశాల ఉపాధ్యాయురాలు ఒకరు తెలిపారు. ఈ ఘటనతో క్యాంపస్‌లో ఉన్న విద్యార్థులను పక్కనున్న భవనాల్లోకి తరలించారు. ఘటనపై ఆ దేశ ప్రధాని ఉల్ఫ్ క్రిస్టర్సన్ స్పందించారు. స్వీడన్‌కు ఇది ఎంతో బాధాకరమైన రోజు అని పేర్కొన్నారు. ప్రశాంతంగా ఉండే యూరప్ దేశంలో కాల్పుల జరగడం చాలా అరుదు. అయితే కొన్నేళ్ల నుంచి గ్యాంగ్ వార్‌లు పెరుగుతున్నాయి. దానికి తోడు అక్రమ వలసలు స్వీడన్‌కు తలనొప్పిగా మారాయి

# మాజీ సీఎం కేసీఆర్‌కు ప్రధాని మోడీ లేఖ..

### సోదరి మరణంపై సంతాప సందేశం

**ఈ-కబురు,ఢిల్లీ**



ఫిబ్రవరి 04 : బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌కు ప్రధాని మోడీ సంతాప సందేశం పంపారు. ఈ మేరకు ప్రధాని మోడీ పీఎంవో ఆఫీస్ నుంచి ఒక లేఖ విడుదల చేశారు. ఇటీవల కేసీఆర్ సోదరి (అక్క) చీటి సకలమ్మ మరణం పట్ల ప్రధాని నరేంద్ర మోడీ సంతాపం ప్రకటించారు. కేసీఆర్ సోదరి మరణం గురించి మరణ వార్త తెలుసుకుని దిగ్భ్రాంతి చెందానని లేఖలో పేర్కొన్నారు. ఈ అనుకోని ఘటన ఎంతో బాధకు గురిచేసిందని, కుటుంబ సభ్యులకు తీరని లోటుగా మిగిలిపోతుందని తెలిపారు. సోదరి మరణంతో బాధాతప్త హృదయంతో ఉన్న కేసీఆర్‌కి వారి కుటుంబ సభ్యులకు ప్రధాని తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కాగా, మాజీ సీఎం కేసీఆర్ సోదరి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలిసిందే. చీటి సకలమ్మ మరణం పట్ల రాష్ట్ర ప్రభుత్వంతో పాటు పలువురు రాజకీయ నేతలు సంతాపం తెలిపారు. ఇక కేసీఆర్ తన సోదరిని కడసారి చూసుకునేందుకు ఫాంహౌస్ వీడి ఆమె ఇంటికి చేరుకుని ఘన నివాళులు అర్పించారు. హరీశ్‌రావు, కేటీఆర్, కవిత సైతం సకలమ్మ పార్థివ దేహానికి నివాళ్లు అర్పించారు. సకలమ్మ కుటుంబ సభ్యులను బంధువులను కేసీఆర్ ఓదార్చారు. కాగా,




గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న సకలమ్మ(82) హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ మృతి చెందారు. కేసీఆర్‌కు సకలమ్మ 5వ సోదరి, ఆమె స్వగ్రామం రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం పెదిర గ్రామం. ఆమె భర్త హన్మంతరావు గతంలోనే మృతి చెందారు. వారికి ముగ్గురు కుమారులు ఉన్నారు.



## ఇంకెప్పుడు ప్రిపేర్
# అవుతారు?

### అసెంబ్లీ వాయిదాపై హరీశ్ రావు ఫైర్

**ఈ-కబురు, హైదరాబాద్**

ఫిబ్రవరి 04 : తెలంగాణ అసెంబ్లీ ప్రత్యేక సమావేశాలు ప్రారంభమైన కొద్దిసేపటికే వాయిదా పడ్డాయి. మంగళవారం ఉదయం 11 గంటలకు ప్రారంభం అయిన వెంటనే కేబినెట్ భేటీ నేపథ్యంలో శాసనసభ వ్యవహారాల మంత్రి శ్రీధర్ బాబు విజ్ఞప్తితో సభను స్పీకర్ మధ్యాహ్నం 2 గంటలకు వాయిదా వేశారు. అసెంబ్లీ వాయిదా వేయడంపై బీఆర్ఎస్ నేతలు మండిపడుతున్నారు. ఈ క్రమంలోనే మాజీ మంత్రి హరీశ్ రావు స్పందించారు. అసెంబ్లీ ప్రారంభమైన రెండు నిమిషాలకే వాయిదా వేయటం ఏమిటని ఎక్స్ వేదికగా నిలదీశారు. కేబినెట్ సమావేశం ఇంకా కొనసాగుతున్నదని, సబ్జెక్ట్, నోట్స్ సిద్ధం చేయలేదని సభను వాయిదా వేయాలని మంత్రి శ్రీధర్ బాబు కోరడం హాస్యాస్పదమని విమర్శించారు.

# న్యూగో భారతదేశపు మొట్టమొదటి పూర్తి ఎలక్ట్రిక్ స్లీపర్ ఏసీ బస్సు

## హైదరాబాద్-రాజమండ్రి .. విజయవాడ - విశాఖపట్నం మార్గాలలో ప్రారంభం

### టికెట్ ధర రూ. 699/- మాత్రమే

**ఈ-కబురు,ముంబై**

ఫిబ్రవరి 04 : గ్రీన్‌సెల్ మొబిలిటీకి చెందిన భారతదేశం లో అతిపెద్ద ఎలక్ట్రిక్ ఇంటర్‌సిటీ బస్సు సేవ అయిన న్యూగో, భారతదేశపు మొట్టమొదటి ఎలక్ట్రిక్ ఏసీ స్లీపర్ బస్సు సేవను ప్రారంభించింది. ఈ వినూత్న ప్రయాణ సేవ సుస్థిరత మరియు సౌకర్యాన్ని పెంపొందించడంలో కీలకమైన ముందడుగు. భారతదేశవ్యాప్తంగా ముఖ్యమైన మార్గాలలో విస్తరణ ద్వారా, న్యూగో స్లీపర్ బస్సు మార్కెట్‌లో ముఖ్యమైన వాటాను స్వాధీనం చేసుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంది. న్యూగో ఎలక్ట్రిక్ స్లీపర్ బస్సులు దిల్లీ - అమృత్‌సర్, బెంగళూరు - చెన్నై, హైదరాబాద్ - రాజమండ్రి, చెన్నై - మధురై, విజయవాడ - విశాఖపట్నం, బెంగళూరు - మధురై వంటి ప్రధాన మార్గాలలో నడుస్తాయి. సురక్షితమైన, సౌకర్యవంతమైన, మరియు సుస్థిరమైన ప్రయాణ అనుభవాన్ని అందించడం న్యూగో యొక్క ప్రధాన లక్ష్యం. భారతదేశంలో 450 బ్యాటరీతో హోమోలోగేట్ చేయబడిన మొట్టమొదటి స్లీపర్ బస్సులు ఇవే. గ్రీన్‌సెల్ మొబిలిటీ ఎండీ మరియు సీఈఓ దేవేంద్ర చావ్లా మాట్లాడుతూ, "న్యూగో ఎలక్ట్రిక్




ఇంటర్‌సిటీ స్లీపర్ బస్సు సేవ ప్రారంభం భారతదేశంలో సుస్థిర రవాణా కోసం గట్టి అడుగు. గ్రీన్, శుభ్రమైన భవిష్యత్తు కోసం మా నిబద్ధతను ఈ బస్సులు ప్రతిబింబిస్తాయి. ప్రయాణికులకు అత్యుత్తమ అనుభవాన్ని అందించడమే మా లక్ష్యం" అని అన్నారు. ప్రయాణికులకు మరింత సౌకర్యం అందించడానికి, ఈ బస్సులు విస్తృతమైన బెర్త్‌లు, మెత్తటి టచ్ ఇంటీరియర్స్, యాంబియంట్ లైటింగ్, యూఎస్‌బీ ఛార్జింగ్ పోర్ట్‌లు, నైట్ రీడింగ్ లైట్స్, బెర్త్ పాకెట్ మరియు ఆధునిక శానిటరీ సౌకర్యాలతో అమర్చబడి ఉన్నాయి. భద్రతను మెరుగుపరిచేందుకు, ఈ బస్సులుఏబిఎస్ బ్రేకులు, ఇ ఎస్ సి , ఫుల్ ఎయిర్ సస్పెన్షన్ మరియు రోల్ ఓవర్-ఇంజనీరింగ్ ఫ్రేమ్ వంటి అత్యాధునిక భద్రతా లక్షణాలను కలిగి ఉన్నాయి. రెజెనరేటివ్ బ్రేకింగ్ వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం కలిగిన ఈ బస్సులు శబ్దం-రహితంగా, వైబ్రేషన్-రహితంగా మరియు పర్యావరణ అనుకూలంగా ఉంటాయి. ఒక ఛార్జ్‌తో 350 కిమీ ప్రయాణించగలిగే సామర్థ్యం, రోజుకు 600 కిమీ వరకు వేగంగా ఛార్జింగ్ ద్వారా విస్తరించబడే అవకాశం కలిగి ఉంది. మహిళల భద్రత న్యూగోకు అత్యంత ప్రాధాన్యత. ఇది 24/7 ప్రత్యేక మహిళా హెల్ప్‌లైన్, పింక్ సీట్ ఆప్షన్, పరిశుభ్రమైన మిడ్-పాయింట్లు, సీసీటీవీ సర్వైలెన్స్, జీపీ ఎస్ లైవ్ ట్రాకింగ్, డ్రైవర్ బ్రీత్ ఎనలైజర్ టెస్టింగ్, మరియు 80 కి.మీ వేగ పరిమితి వంటి భద్రతా లక్షణాలతో ప్రయాణ సేవలను అందిస్తోంది.

# అక్రమ వలసలపై ట్రంప్ కొరడా..

### ఎంతమంది భారతీయులపై ప్రభావం?

**ఈ-కబురు,వాషింగ్టన్**

ఫిబ్రవరి 04 : రెండోసారి అమెరికా పగ్గాలు చేపట్టిన డొనాల్డ్ ట్రంప్ ఎన్నికల్లో చెప్పినట్లుగానే అక్రమ వలసదారులపై ఉక్కుపాదం మోపారు. కఠిన నిర్ణయాలతో వారిని అమెరికా నుంచి సాగనంపే ప్రక్రియను వేగవంతం చేశారు. దీంతో అమెరికా చరిత్రలోనే అతిపెద్ద బహిష్కరణ ఆపరేషన్ కొనసాగుతోంది. ఇందులో భాగంగా అక్రమంగా వలస వెళ్లిన భారతీయుల్ని మిలటరీ విమానం సీ-17లో వెనక్కి పంపించేస్తున్నారు. మొదటి బ్యాచ్‌గా 205మంది భారతీయులతో మంగళవారం టెక్సాస్‌లో బయల్దేరిన విమానం పంజాబ్‌లోని అమృత్‌సర్ చేరుకోనుంది. అసలు అమెరికాకు అక్రమంగా వలసవెళ్లిన భారతీయులు ఎందరు? ఈ పరిణామంపై భారత్ ఏమంటోంది? అమెరికా చర్యను ధిక్కరించిన దేశాల పరిస్థితి ఎలా ఉందనే అంశాల్ని పరిశీలిస్తే..

అక్రమంగా అమెరికాకు వలస వచ్చినవారంతా ఆయా దేశాలకు



వెళ్లిపోవాల్సిందేనని డొనాల్డ్ ట్రంప్ ఇప్పటికే స్పష్టంచేశారు. ఆ దిశగానే అధికార యంత్రాంగం చర్యల్ని ముమ్మరం చేసింది. అక్రమ వలసదారుల్ని ఉపేక్షించడంలేదు. సరైన పత్రాలు లేనివారిని లేదా అక్రమ వలసదారుల్ని వారి స్వదేశాలకు పంపేందుకు వాణిజ్య, సైనిక విమానాలను వినియోగిస్తోంది.

ట్రంప్ సర్కార్ నిర్ణయం వేలాది మంది భారతీయ పౌరులపై ప్రభావం చూపుతుందని భావిస్తున్నారు.

అమెరికాలో భారత్‌కు చెందిన అక్రమ వలసదారులు 7,25,000 మంది ఉన్నట్లు అంచనా. వీరిలో 18,000 మందిని భారత్‌కు తరలించేందుకు అమెరికా ప్రభుత్వం జాబితాను రూపొందించినట్లు తెలుస్తోంది. ఈ 7.25లక్షల మంది భారతీయుల్లో ఎక్కువమంది వీసా గడువు పూర్తయినా అక్కడ ఉంటున్నవారే కావడం గమనార్హం.

ఎల్ పాసో, టెక్సాస్, శాన్ డియాగో, కాలిఫోర్నియాల నుంచి 5,000 మంది అక్రమ వలసదారులను బహిష్కరించి ఆయా దేశాలకు తరలించేందుకు పెంటగాన్ చర్యలు చేపట్టింది. సైనిక విమానాలు ఇప్పటికే గ్వాటెమాల, పెరూ, హోండురాస్‌లకు వలసదారుల్ని తరలించాయి.

### భారత్ ఏమంటోంది?

సరైన పత్రాలు లేకుండా ఇతర దేశాలకు వలస వెళ్లి స్వదేశానికి తిరిగి రావాలనుకునే భారతీయులను తిరిగి స్వీకరించేందుకు ఎప్పుడూ సిద్ధమేనని భారత విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి ఎస్.జైశంకర్ గత నెలలోనే స్పష్టం చేశారు. అమెరికా నుంచి భారత్‌కు తిరిగి పంపదగిన అక్రమ వలసదారులు ఎందరన్నది ఇంకా ఇదమిత్థంగా ఖరారు కాలేదన్నారు. "మేం ఎప్పుడూ చట్టబద్ధమైన వలసలకే మద్దతు పలుకుతాం. భారతీయుల ప్రతిభాపాటవాలకు ప్రపంచ స్థాయి గుర్తింపు, అవకాశాలు లభించాలని కోరుకుంటున్నాం.

## వేగంగా అణుబాంబు తయారీకి
# ఇరాన్ అన్వేషణ..!

**ఈ-కబురు,ఇరాన్**

ఫిబ్రవరి 04 : ఇరాన్ ప్రభుత్వం అణుబాంబు తయారుచేయాలనుకోగానే.. దానిని సిద్ధం చేసేందుకు ఉన్న మార్గాలను అక్కడి శాస్త్రవేత్తల రహస్య యత్నాలు మొదలుపెట్టింది. ఈ విషయాన్ని అమెరికా ఇంటెలిజెన్స్ వర్గాలు పసిగట్టినట్లు ఇటీవల న్యూయార్క్ టైమ్స్ కథనం ప్రచురించింది. దేశ నాయకత్వం నుంచి అణుబాంబు తయారీకి గ్రీన్ సిగ్నల్ వచ్చిన వెంటనే అందుబాటులో ఉన్న యూరేనియం నిల్వలతో కొన్ని నెలల్లోనే దానిని సిద్ధం చేసేలా ప్లాన్ చేస్తున్నారు. ఇంటెలిజెన్స్ అధికారులు ఈ సమాచారాన్ని బైడెన్ అధికారంలో ఉన్నప్పుడే సేకరించారు. తాజాగా ఇప్పుడు ట్రంప్ కార్యవర్గంతో కూడా దీనిని పంచుకొన్నారు. ఇటీవల సిరియా, పాలస్తీనా, లెబనాన్‌లో చోటుచేసుకొన్న పరిణామాలతో పశ్చిమాసియాలో ఇరాన్ పట్టు సడలిపోయింది. దానిని పరోక్ష బలగాలను ఇజ్రాయెల్, అమెరికా మద్దతుతో సిరియా తిరుగుబాటుదారులు అణచివేశారు. ఇజ్రాయెల్ క్షిపణి, వైమానిక దాడులతో ఆయుధ తయారీ సామర్థ్యం కూడా దెబ్బతింది. మరోవైపు ట్రంప్ అధికారం చేపట్టిన వెంటనే ఇజ్రాయెల్‌లో నెతన్యాహును బలోపేతం చేశారు. ఇక ఇరాన్



కూడా బాంబుగ్రేడు యూరేనియంను ఉత్పత్తి చేసే దిశగా తన సెంట్రిఫ్యూజ్‌లో మార్పులు చేసి 60శాతం వరకు శుద్ధి చేస్తోందని అంతర్జాతీయ అణుశక్తి సంస్థ చెబుతోంది. పౌర అణు అవసరాల కోసం ఏ దేశం కూడా ఆ స్థాయిలో యూరేనియంను శుద్ధి చేయదని చెబుతున్నారు. వాస్తవానికి ఒక అణుబాంబు తయారీకి 42 కిలోలు 90శాతం శుద్ధి చేసిన యూరినియం ఉంటే సరిపోతుంది. ప్రస్తుతం ఇరాన్ వద్ద 200 కిలోల మేరకు 60శాతం శుద్ధి చేసిన యూరేనియం ఉంది. గత వారం ఇరాన్ విదేశాంగ మంత్రి మాట్లాడుతూ తమ అణు స్థావరాలపై దాడులు చేస్తే చాలా వేగంగా.. బలంగా స్పందిస్తామని హెచ్చరించారు. ఇది ఆలౌట్ వార్‌కు దారితీస్తుందని పేర్కొన్నారు.




ముంబై: కీలక వడ్డీ రేట్ల కోతను ఆర్‌బిఐ ఈ వారంలో జరిగే సమీక్షతో షురూ చేయొచ్చని ప్రముఖ ఆర్థిక వేత్తలు అంచనా వేస్తున్నారు. కొత్త ఆర్‌బిఐ గవర్నర్‌గా ఇటీవలే బాధ్యతలు చేపట్టిన సంజయ్ మల్హోత్రా ఆధ్వర్యంలో ఆరుగురు సభ్యుల మానిటరీ పాలసీ కమిటీ (ఎంపీసీ) తొలిసారిగా ఈ నెల 5 నుంచి 7వ తేదీ మధ్య భేటీ కానుంది. ఈ సందర్భంగా రెపో రేటును (వాణిజ్య బ్యాంకులకు ఇచ్చే స్వల్పకాలిక రుణాలపై ఆర్‌బిఐ వసూలు చేసే రేటు) 25 బేసిస్ పాయింట్లు (0.25 శాతం) తగ్గించొచ్చని భావిస్తున్నారు.

# ఈసారి వడ్డీ రేట్లు తగ్గింపు..?

రెండేళ్లుగా కీలక రెపో, రివర్స్ రెపో (ఆర్‌బీఐ వద్ద బ్యాంకులు ఉంచే నిధులపై చెల్లించే రేటు)ను ఆర్‌బీఐ ఎలాంటి మార్పులు చేయకుండా కొనసాగిస్తోంది. కేంద్ర బడ్జెట్‌లో వినియోగానికి మద్దతుగా ఆదాయపన్ను విషయంలో పెద్ద ఎత్తున ఊరట కల్పించినందున, దీనికి కొనసాగింపుగా వ్యవస్థలో లిక్విడిటీ పెంపు, వృద్ధికి మద్దతుగా ఆర్‌బీఐ నిర్ణయాలు తీసుకోవచ్చన్న అభిప్రాయాలు వినపడుతున్నాయి. ముఖ్యంగా ద్రవ్యోల్బణం ఆర్‌బీఐ గరిష్ట నియంత్రణ పరిధి 6 శాతం లోపే ఉన్నందున రేట్ల తగ్గింపునకు వెసులుబాటు ఉందని నిపుణులు అంటున్నారు. సెప్టెంబర్ త్రైమాసికంలో జీడీపీ వృద్ధి రేటు ఏడు కనిష్టాల త్రైమాసిక స్థాయిలో 5.4 శాతానికి పడిపోవడం గమనార్హం. 'రేట్ల తగ్గింపునకు రెండు బలమైన కారణాలున్నాయి. ఆర్‌బీఐ ఇప్పటికే లిక్విడిటీ పెంచే చర్యలకు శ్రీకారం చుట్టింది. దీంతో మార్కెట్ పరిస్థితులు మెరుగుపడ్డాయి. ఇది రేట్ల కోత ముందస్తు సూచికగా ఉంది' అని బ్యాంక్ ఆఫ్ బరోడా చీఫ్ ఎకనమిస్ట్ మదన్ సబ్నవిస్ తన అభిప్రాయాలు వెల్లడించారు. కేంద్ర బడ్జెట్‌లో చర్యలకు మద్దతుగా రెపో రేటును తగ్గించొచ్చన్నారు. 'కేంద్ర బడ్జెట్‌లో ద్రవ్యపరమైన ఉద్దీపనలు ద్రవ్యోల్బణంపై గణనీయమైన ప్రభావం చూపిస్తాయని భావించడం లేదు. కనుక 2025 ఫిబ్రవరి సమీక్షలో రేట్ల కోతకు సానుకూలతలు ఉన్నాయి' అని ఇక్రా రేటింగ్స్ రీసెర్చ్ హెడ్, చీఫ్ ఎకనమిస్ట్ అదితి నాయర్ అభిప్రాయపడ్డారు. ఒకవేళ ఈ వారంలో రూపాయి విలువ మరింత బలహీనపడే అంతర్జాతీయ పరిణామాలు చోటుచేసుకుంటే రేట్ల కోత వాయిదా పడొచ్చన్నారు.

భారత ఆర్థిక వ్యవస్థ రుణ భారం పెరుగుతుందని, ఒకవేళ ఏవైనా పెద్ద ఆర్థిక సమస్యలు ఎదురైతే ఇది మరింత పెరగొచ్చని (దిగువ వైపు రిస్క్) ఫిచ్ రేటింగ్స్ తెలిపింది. దీంతో సార్వభౌమ రేటింగ్ తగ్గుదల రిస్క్ పొంచి ఉన్నట్టు అభిప్రాయం వ్యక్తం చేసింది. అదే సమయంలో మధ్య కాలానికి సంబంధించి ద్రవ్య కార్యాచరణను కట్టుబడడం, రుణ భారాన్ని తగ్గించుకునే విషయంలో విశ్వాసం పెరిగినట్లు తెలిపింది. ఇది నిర్ణీత కాలానికి సార్వభౌమ రేటింగ్ పరంగా సానుకూలం అని ఫిచ్ రేటింగ్స్ తెలిపింది.

చివరిసారిగా 2024 ఆగస్టులో భారత్‌కు బీబీబీ మైనస్-స్టెబుల్ (స్థిరత్వం) రేటింగ్‌ను కొనసాగిస్తున్నట్టు ఫిచ్ రేటింగ్స్ ప్రకటించింది. పెట్టుబడుల పరంగా ఇది కనిష్ట రేటింగ్. 2006 ఆగస్ట్ నుంచి భారత్‌కు ఇదే రేటింగ్‌ను ఫిచ్ కొనసాగిస్తూ వస్తోంది. 2024%-%25 సంవత్సరానికి జీడీపీలో ద్రవ్యోలోటును 4.8 శాతానికి కట్టడి చేయనున్నట్టు, 2025%-%26లో దీన్ని 4.4 శాతానికి తగ్గించుకోనున్నట్టు ఆర్థిక మంత్రి నిర్మాలా సీతారామన్ బడ్జెట్‌లో ప్రకటించడం తెలిసిందే. ఆర్థిక వృద్ధి బలహీన పడిన తరుణంలోనూ రుణ భారం తగ్గింపునకు ప్రభుత్వం కట్టుబడి ఉండడాన్ని ఫిచ్ రేటింగ్స్ భారత ప్రైమరీ సావరీన్ అనలిస్ట్ జెరెమీ జూక్ ఈ సందర్భంగా ప్రశంసించారు. అంచనాలు వాస్తవికంగా ఉన్నాయంటూ, వాటిని భారత్ సాధించొచ్చని అభిప్రాయపడ్డారు. అయితే బలహీన ఆర్థిక వృద్ధి నేపథ్యంలో ఆదాయం వసూళ్లు చెప్పుకోతగ్గ స్థాయిలో తగ్గిపోవచ్చని హెచ్చరించారు. దీనికి అదనంగా ఖర్చు నియంత్రణ చర్యలు అవసరం

# సావరీన్ రేటింగ్‌కు 'క్షీణత రిస్క్'

కావొచ్చన్నారు. 2025%-%26 బడ్జెట్ వృద్ధికి తటస్థంగా ఉన్నట్టు ఫిచ్ రేటింగ్స్ తెలిపింది. పన్నుల తగ్గింపుతో వినియోగానికి ఊతమివ్వడం, స్థిరమైన మూలధన వ్యయాలు అనేవి ద్రవ్యలోటు తగ్గింపు ప్రతికూలతలను భర్తీ చేయొచ్చని ఫిచ్ రేటింగ్స్ తెలిపింది. నియంత్రణల తొలగింపు ద్వారా పెట్టుబడులను ఇతోధికం చేసే విధానం మధ్య కాలానికి వృద్ధి సానుకూలమని, విధానాల కచ్చితమైన అమలుపైనే విజయం ఆధారపడి ఉంటుందని పేర్కొంది. వృద్ధి, ద్రవ్యలోటు తగ్గింపు మధ్య సమతుల్యత అన్నది మరింత సవాలుతో కూడినదిగా తెలిపింది. రానున్న సంవత్సరాల్లో అంచనాల కంటే ఆదాయం తక్కువగా ఉండొచ్చని.. కఠినమైన వ్యయ నియంత్రణలు, మూలధన వ్యయ నియంత్రణల ప్రాముఖ్యాన్ని ఇది తెలియజేస్తున్నట్టు పేర్కొంది. మధ్య కాలానికి ద్రవ్యలోటు పట్ల ప్రభుత్వం గొప్ప స్పష్టత ఇచ్చిందని తెలిపింది. 2031 మార్చి నాటికి జీడీపీలో రుణభారాన్ని 50 శాతానికి తగ్గించుకోనున్నట్టు బడ్జెట్‌లో ప్రకటించడాన్ని గుర్తు చేసింది. 2025 మార్చి నాటికి అంచనాలతో పోల్చితే 7 శాతం తగ్గనుంది.

**సావరీన్ రేటింగ్ యథాతథం**

వచ్చే ఏడాదికి ద్రవ్య లోటును జీడీపీలో 4.4 శాతానికి కట్టడి చేసేందుకు ఆర్థిక శాఖ ప్రతిపాదించిన నేపథ్యంలో ఇండియా సావరీన్ రేటింగ్‌ను వెంటనే అప్‌గ్రేడ్ చేయబోమని రేటింగ్స్ దిగ్గజం మూడీస్ స్పష్టం చేసింది. కేంద్ర ప్రభుత్వం ఆర్థిక పరిస్థితులను చక్కదిద్దే బాటలో సమర్థవంత చర్యలకు తెరతీస్తుండటాన్ని సానుకూలంగా పరిగణిస్తున్నట్లు మూడీస్ సీనియర్ వైస్‌ప్రెసిడెంట్ క్రిస్టియన్ డి గజ్‌మన్ పేర్కొన్నారు. అయితే ద్రవ్య లోటు కట్టడి, ఆర్థిక క్రమశిక్షణ తదితరాల కారణంగా మెరుగుపడనున్న రుణ సామర్థ్యం, రుణభారం తదితరాలతో సావరీన్ రేటింగ్ పెంపునకు త్వరపడబోమని తెలియజేశారు. ప్రస్తుతం మూడీస్ దేశీ సావరీన్ రేటింగ్‌ను సుస్థిర ఔట్‌లుక్‌తో బీఏఏ3గా కొనసాగిస్తోంది. ఇది కనీస ఇన్వెస్ట్‌మెంట్ గ్రేడ్ రేటింగ్‌కాగా.. తాజా బడ్జెట్‌లో ఆర్థిక మంత్రి సీతారామన్ ఈ ఏడాది(2024%-%25) ద్రవ్య లోటు 4.8 శాతానికి పరిమితం కానున్నట్లు అభిప్రాయపడ్డారు. 2025%-%26లో 4.4 శాతానికి కట్టడి చేసే ప్రణాళికలు ప్రకటించారు.






## వణికిస్తున్న బంగారం ధర! తులం ఎంతంటే..

హైదరాబాద్, విజయవాడ, గుంటూరు, ప్రొద్దుటూరు, బెంగళూరు, ముంబై ప్రాంతాల్లో ఒక తులం బంగారం ధరలు రూ.78,100 (22 క్యారెట్స్), రూ.85,200 (24 క్యారెట్స్) వద్ద ఉన్నాయి. సోమవారం ధరలతో పోలిస్తే ఈ రోజు 10 గ్రాముల బంగారం ధర వరుసగా రూ.1050, రూ.1,150 పెరిగింది.

చెన్నైలో మంగళవారం 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం ధరలు రూ.1050, 24 క్యారెట్ల 10 గ్రాముల గోల్డ్ రేటు రూ.1150 పెరిగింది. దీంతో గోల్డ్ రేటు రూ.78,100 (22 క్యారెట్స్ 10 గ్రామ్స్ గోల్డ్), రూ.85,200 (24 క్యారెట్స్ 10 గ్రామ్ గోల్డ్)కు చేరింది.

దేశ రాజధాని నగరం దిల్లీలో బంగారం ధర నిన్నటితో పోలిస్తే పెరిగింది. ఈ రోజు 10 గ్రాముల 22 క్యారెట్స్ పసిడి ధర రూ.1050 పెరిగి రూ.78,250కు చేరుకోగా.. 24 క్యారెట్ల ధర రూ.1150 పెరిగి రూ.85,350 వద్దకు చేరింది.

వెండి ధరలు

బంగారం ధరలు పెరిగినప్పటికీ..వెండి ధరల్లో మాత్రం మంగళవారం తగ్గుదల కనిపించింది. దీంతో నిన్నటితో పోలిస్తే కేజీ వెండి రేటురూ.1,000 తగ్గి రూ.1,06,000 వద్ద నిలిచింది.

## లాభాల్లో స్టాక్‌మార్కెట్లు

దేశీయ స్టాక్ మార్కెట్లు మంగళవారం లాభాల్లో ట్రేడవుతున్నాయి. ఉదయం 9:30 సమయానికి నిఫ్టీ231 పాయింట్లు నష్టపోయి 23,253కు చేరింది. సెన్సెక్స్682 పాయింట్లు దిగజారి 76,802 వద్ద ట్రేడవుతోంది. అమెరికా డాలర్ ఇండెక్స్108.71 పాయింట్ల వద్దకు చేరింది. బ్రెంట్ క్రూడ్ఆయిల్ బ్యారెల్ ధర 75.5 అమెరికన్ డాలర్ల వద్ద ఉంది. యూఎస్ 10 ఏళ్ల బాండ్ ఈల్డ్‌లు 4.57 శాతానికి చేరాయి.



అమెరికా మార్కెట్లు గడిచిన సెషన్‌లో నష్టాల్లో ముగిశాయి. ఎస్ అండ్ పీ గత సెషన్‌తో పోలిస్తే 0.76 శాతం నష్టపోయింది. నాస్‌డాక్ 1.2 శాతం దిగజారింది. కొత్త ఏడాదిలో తొలిసారి పరపతి సమీక్షను చేపట్టనున్న రిజర్వ్ బ్యాంక్ శుక్రవారం(7న) విధాన నిర్ణయాలను ప్రకటించనుంది. దాదాపు ఐదేళ్ల తదుపరి ఆర్‌బీఐ వడ్డీ రేట్లను తగ్గించవచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు. గత 11 సమావేశాలలో వడ్డీ రేట్లకు కీలకమైన రెపోను 6.5 శాతం వద్దే యథాతథంగా కొనసాగిస్తున్న సంగతి తెలిసిందే. 2022 మే నుంచి 2023 ఫిబ్రవరి కాలంలో రెపో రేటులో 2.5 శాతం కోతను అమలు చేసింది. రిటైల్ ధరల ఇండెక్స్(సీపీఐ) డిసెంబర్‌లో 4 నెలల కనిష్టం 5.22 శాతానికి దిగివచ్చింది. వచ్చే ఆర్థిక సంవత్సరంలో 4 శాతానికి పరిమితంకానున్న అంచనాల నేపథ్యంలో ఈసారి ఆర్‌బీఐ రెపో రేటును పావు శాతం తగ్గించవచ్చని ఆర్థికవేత్తలు భావిస్తున్నారు.

# శంతనుకు టాటా మోటార్స్‌లో కీలక బాధ్యతలు

దివంగత వ్యాపార దిగ్గజం 'రతన్ టాటా' మిత్రుడిగా గుర్తింపు తెచ్చుకున్న 'శంతను నాయుడు' కు టాటా మోటార్స్‌లో కీలక బాధ్యతలు అప్పగించారు. ఈయన కంపెనీలో జనరల్ మేనేజర్ %ు% స్ట్రాటజిక్ ఇనిషియేటివ్స్ హెడ్‌గా నియమితులయ్యారు. ఈ విషయాన్ని తానె స్వయంగా తన లింక్డ్ఇన్‌లో వెల్లడించారు.

"టాటా మోటార్స్‌లో స్ట్రాటజిక్ ఇనిషియేటివ్స్ హెడ్ %ు% జనరల్ మేనేజర్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్నందుకు నాకు సంతోషంగా ఉంది. నా తండ్రి తన తెల్లటి చొక్కా, నేవీ ప్యాంటుతో టాటా మోటార్స్ ప్లాంట్ నుంచి ఇంటికి నడిచి వచ్చేవారు. ఆయన కోసం నేను కిటికీలో చూస్తూ ఉండేవాడిని. ఆ సంఘటన నాకు ఇంకా గుర్తుంది" అని శంతను నాయుడు తన లింక్డ్ఇన్‌లో రాశారు.

ఎవరీ శంతను నాయుడు?

శంతను నాయుడు ఒక ఆటోమొబైల్ డిజైన్ ఇంజినీర్. ఇతడు ఒక రోజు రోడ్డు మధ్యలో వీధి



కుక్క చనిపోయి ఉండటాన్ని గమనించిన చలించిపోయాడు. ఆ తరువాత వీధి కుక్కల సంరక్షణకు ఏదో ఒకటి చేయాలని ఆలోచనలో పడ్డాడు. తన స్నేహితులతో కలిసి వీధి కుక్కల కోసం రేడియం స్టిక్కర్లతో తయారు చేసిన కాలర్స్‌ని తయారు చేశాడు. తన ఇంటి పరిసరాల్లోని కుక్కలకు వాటిని అమర్చాడు. ఆ పనికి మరుసటి రోజే స్థానికుల నుంచి మెప్పు పొందాడు.

ముంబైలో ఉన్న వీధి కుక్కలన్నింటికీ ఈ రేడియం కాలర్ అమర్చాలని నిర్ణయించారు. కానీ అది డబ్బుతో కూడకున్న వ్యవహారం కావడంతో విషయాన్ని తన తండ్రికి చెప్పాడు. ఆయన 'వీధి కుక్కలను కాపాడేందుకు సాయం చేయాల్సిందిగా రతన్ టాటాని అడుగు. ఆయనకు కుక్కలంటే ఇష్టం' అని సలహా ఇచ్చాడు.

మోటోపాస్ పేరుతో స్టార్టప్

వీధి కుక్కలను రోడ్డు ప్రమాదాల నుంచి కాపాడేందుకు 'మోటోపాస్' పేరుతో స్టార్టప్ ఏర్పాటు చేశానని, దానికి సాయం చేయాల్సిందిగా కోరుతూ పూర్తి వివరాలు కలిగిన ఈ మెయిల్‌ను ఏకంగా రతన్‌టాటాకే పంపాడు. రోజులు గడుస్తున్నా ఎలాంటి రిప్లై లేకపోవడంతో తన పనిలో తాను నిమగ్నమయ్యాడు.

చివరకు రెండు నెలల తర్వాత నేరుగా తనని కలవాలంటూ రతన్‌టాటా నుంచి ఆహ్వానం అందింది. అదే రతన్‌టాటాతో శంతన్ నాయుడికి తొలి పరిచయం ఏర్పడేలా చేసింది. వ్యక్తిగతంగా రతన్ టాటాను కలిసి తన ప్రాజెక్టు గురించి వివరించాడు. వీధి కుక్కల పట్ల అతను చూపించే ప్రేమకు రతన్‌టాటా ఫిదా అయ్యారు. వెంటనే సాయం చేసేందుకు అంగీకరించారు. అలా మోటోపాస్ స్టార్టప్‌నకు ఆర్థికసాయం అందింది.

కార్నెల్ యూనివర్సిటీలో ఎంబీఏ సీటు రావడంతో శంతను అమెరికా బయల్దేరాడు. ఎంబీఏ పూర్తి చేసిన తర్వాత టాటా గ్రూపులో పని చేయాలని శంతను నిర్ణయించుకున్నాడు. %వీదూ% పూర్తి చేసి ఇండియాకు వచ్చిన తర్వాత టాటా ట్రస్టులో డిప్యూటీ జనరల్ మేనేజర్(డిజీఎం) హోదాలో చేరారు. అయితే కొద్ది కాలానికే శంతను నాయుడును పిలిపించుకున్న రతన్ టాటా..తనకు వ్యక్తిగత సహాయకుడిగా ఉ ండాలని కోరారు. దాంతో 2018 నుంచి టాటా తుది శ్వాస వరకు వెన్నంటి ఉన్నాడు.

**గుడ్‌ఫెలోస్‌జి**

సాటి జీవుల పట్ల శంతను నాయుడికి ఉన్న ప్రేమ రతన్‌టాటాను ఆకట్టుకున్నాయి. శంతన్ నాయుడి ఆలోచణ సరళి టాటాను ఆకర్షించింది. మోటోపాస్‌తోపాటు శంతన్ సెప్టెంబర్ 2022లో 'గుడ్‌ఫెలోస్'ను స్థాపించారు. ఇది యువకులను మమేకం చేసి సీనియర్ సిటిజన్‌ల ఒంటరితనం పోగొట్టేందుకు పనిచేస్తోంది. అతను 'ఐ కేమ్ అపాన్ ఎ లైట్‌హౌస్' పేరుతో రతన్ టాటాతో ఉన్న జ్ఞాపకాలు, తన నుంచి నేర్చుకున్న విషయాలపై పుస్తకం రాశారు.



## స్టార్ హీరోతో ఛాన్స్..

### మరోసారి ఐటమ్ సాంగ్‌లో శ్రియ

సాధారణంగా భారీ చిత్రాల్లో ఐటమ్ సాంగ్స్ చోటు చేసుకోవడం పరిపాటిగా మారింది. ముఖ్యంగా స్టార్ హీరోల చిత్రాల్లో ప్రముఖ హీరోయిన్లు ప్రత్యేక పాటల్లో నటించడానికి వెనుకాడడం లేదు. అలాంటి పాటల్లో నటించడం వల్ల భారీ పారితోషికం ముడుతుండటం, పేరు రావడమే అందుకు కారణం. ఇకపోతే ఐటమ్ సాంగ్స్ చిత్రాలకు అదనపు ఆకర్షణగా మారుతున్నాయి. అలా నటి శ్రియకూడా ఇంతకు ముందు ఐటమ్ సాంగ్స్‌లో నటించారు. కాగా తాజాగా మరోసారి అలాంటి సాంగ్‌తో యువకులను అలరించడానికి సిద్ధమయ్యారు. నటుడు సూర్య కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రాలలో రెట్రో ఒకటి. నటి పూజాహెగ్డే నాయకిగా నటించిన ఈ చిత్రాన్ని



కార్తీక్ సుబ్బరాజ్ తెరకెక్కించారు. ఈయన చిత్రాల్లో కమర్షియల్ అంశాలకు కొదవ ఉండదన్న విషయం తెలిసిందే. అలా రెట్రో చిత్రాన్ని పూర్తిగా కమర్షియల్ అంశాలతో యాక్షన్ ఎంటర్‌టెయినర్‌గా రూపొందించారు. షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం ప్రస్తుతం నిర్మాణాంతర కార్యక్రమాలను జరుపుకపుకుంటోంది. సంతోష్‌నారాయణన్ సంగీతాన్ని అందిస్తున్న ఈ చిత్రం సమ్మర్ స్పెషల్‌గా మే నెలలో తెరపైకి రావడానికి ముస్తాబవుతోంది.

ఇందులో నటి శ్రియ ప్రత్యేక పాటలో నటించడం విశేషం. నటుడు సూర్యతో కలిసి ఆమె నటించిన ఈ పాటను ప్రేమికుల రోజు సందర్భంగా విడుదల చేయనున్నట్లు సమాచారం. కాగా నటుడు సూర్య ప్రస్తుతం నటుడు ఆర్‌జే బాలాజీ దర్శకత్వంలో తన 45వ చిత్రంలో నటిస్తున్నారు. ఇందులో నటి త్రిష నాయకిగా నటిస్తున్నారు. ఈ చిత్ర షూటింగ్ రెండవ షెడ్యూల్ ప్రస్తుతం శరవేగంగా జరుగుతోంది.

## 'అభిమానులతో ఎన్టీఆర్ భారీ సమావేశం'..



యంగ్ టైగర్ జూనియర్ ఎన్టీఆర్ తన అభిమానులకు ఓ విజ్ఞప్తి చేశాడు. మిమ్మల్ని కలిసేందుకు ఎప్పటి నుంచో ఎదురు చూస్తున్నానని తెలిపాడు. త్వరలోనే మీ అందరినీ కలుస్తానని అన్నారు. త్వరలో సమావేశం ఏర్పాటు చేసి వ్యక్తిగతంగా మాట్లాడతానని వెల్లడించారు. తనపై అభిమానులు చూపిస్తున్న అపారమైన ప్రేమ, గౌరవానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. అయితే తనను కలిసేందుకు పాదయాత్రలు లాంటివి చేయవద్దని జూనియర్ ఎన్టీఆర్ విజ్ఞప్తి చేశారు. మీ సంక్షేమమే నాకు ముఖ్యమన్నారు. తనను కలుసుకోవాలని ఎదురు చూస్తున్న మీ ఆసక్తిని అర్థం చేసుకుని వ్యక్తిగతంగా కలుసుకోవాలని నిర్ణయించుకున్నట్లు వెల్లడించారు. అధికారులతో అన్ని అనుమతులు తీసుకుని.. అందరినీ సమన్వయం చేసుకుని ఈ కార్యక్రమాన్ని నిర్వహించుకుందామని తెలిపారు. ఇంత పెద్ద సమావేశం నిర్వహించటానికి కొంత సమయం అవసరం అవుతుంది.. ఈ విషయంలో అభిమానులు ఓర్పుగా ఉండాలని కోరుతున్నట్లు తెలిపారు.

## ఐటీ అధికారుల ఎదుట దిల్ రాజ్



టాలీవుడ్ నిర్మాత, తెలంగాణ ఎఫ్‌డీసీ ఛైర్మన్ దిల్ రాజు తాజాగా ఆదాయపు పన్ను శాఖ అధికారుల ఎదుట హాజరయ్యారు. కొద్దిరోజుల క్రితం సుమారు నాలుగురోజుల పాటు ఆయన ఇళ్లు, ఆఫీసులలో ఐటీ సోదాలు జరిగిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే ఆయన వ్యాపారాలకు సంబంధించిన అకౌంట్స్ అన్నీ అధికారులు తణిఖీలు చేశారని దిల్ రాజు కూడా చెప్పారు. అయితే, అదే సమయంలో దిల్ రాజు వ్యాపారాల గురించి మరిన్ని వివరాలు తెలుసుకునేందుకు ఐటీ అధికారులు నోటీసులు కూడా జారీ చేశారు. ఆయన వ్యాపారాలకు సంబంధించిన పూర్తి వివరాలు ఇవ్వాలని నోటీసులో పేర్కొన్నారు. చిత్ర పరిశ్రమలో తన సినిమాలకు అయిన ఖర్చు ఎంత..? ఎగ్జిబిటింగ్ లెక్కలతో పాటు మూవీ విడుదల తర్వాత వచ్చే లాభాల వ్యవహారంపై ఐటీ అధికారలు ఆరా తీయనున్నారు. సంక్రాంతి సందర్భంగా భారీ బడ్జెట్ సినిమాలను దిల్ రాజు విడుదల చేసిన విషయం తెలిసిందే. ఈ విషయంలోనే ఆయనపై ఐటీ సోదాలు జరిగినట్లు తెలుస్తోంది. దిల్ రాజ్‌తో పాటు పలువురు నిర్మాత, దర్శకుడు ఇళ్లలో కూడా ఐటీ సోదాలు నిర్వహించింది. ఐటీ సోదాలు అంశంలో ఎవరూ ఎక్కువగా ఊహించుకొవద్దని దిల్ రాజు గతంలోనే అన్నారు. ఎలాంటి హాడావుడి లేకున్నా సోషల్ మీడియాలో ప్రచారం చేసుకుంటున్నారని ఆయన తెలిపారు.



## వీడియోలు తొలగించాలంటూ హైకోర్టును ఆశ్రయించిన ఆరాధ్య

బాలీవుడ్ సూపర్‌స్టార్ అమితాబ్ బచ్చన్ మనవరాలు, అభిషేక్–ఐశ్వర్యరాయ్‌ల ముద్దుల కూతురు ఆరాధ్య బచ్చన్ మరోసారి ఢిల్లీ హైకోర్టుని ఆశ్రయించింది. గతేడాదిలో తన ఆరోగ్యంపై తప్పుడు కథనాలను ప్రసారం చేసిన యూట్యూబ్ చానళ్లపై చర్యలు తీసుకోవడంతో పాటు ఆ కథనాలను తొలగించాలని హైకోర్టును ఆశ్రయించారు. ఆరాధ్య పిటిషన్‌పై కోర్టు తీవ్రంగా స్పందించింది. ఈ క్రమంలో గూగుల్‌కు నోటీసులు జారీ చేసింది. గతంలో ఆమె ఫిర్యాదు చేసినప్పుడు ఆ వీడియోలను తొలగించాలని హైకోర్టు ఆదేశాలు ఇచ్చింది. అయినా, కొన్ని వెబ్‌సైట్లతో పాటు పలు సోషల్‌మీడియా ఖాతాలు వాటిని పాటించలేదు. దీంతో ఆమె మరోసారి కోర్టును ఆశ్రయించింది.

గతేడాదిలో ఆరాధ్య బచ్చన్ ఆరోగ్యంపై తప్పుదోవ పట్టించే వార్తలను యూట్యూబ్ వేదికగా ప్రసారం చేశారు. ఆరాధ్య బచ్చన్ తీవ్ర అనారోగ్యంతో ఉన్నారని, ఆరాధ్య ఇక లేరంటూ కొన్ని యూట్యూబ్ ఛానళ్లు ప్రచారం చేశాయి. దీంతో ఆమె తండ్రి అభిషేక్ బచ్చన్ వ్యాజ్యం వేశారు. ఈ అంశంపై విచారణ జరిపిన కోర్టు తీవ్రంగా స్పందించింది. పిల్లల గురించి తప్పుడు సమాచారం వ్యాప్తి చేయడం చాలా తప్పు అని, ఇలాంటి చర్యలు సమాజంలో అనారోగ్యకరమైన వక్రబుద్ధిని ప్రతిబింబిస్తుందని కోర్టు తెలిపింది. సమాజంలోని ప్రతి చిన్నారిని గౌరవంగా చూడటంతో పాటు వారి ఆరోగ్యానికి సంబంధించి తప్పుదోవ పట్టించే సమాచారం వ్యాప్తి చేయడాన్ని చట్టం ఎట్టిపరిస్థితిల్లోనూ సహించదని కోర్టు పేర్కొంది. ఇలాంటి వీడియోలు గూగుల్ దృష్టికి వచ్చినప్పుడు వాటిని తక్షణమే తొలగించాలని న్యాయస్థానం తెలిపింది. అయితే, కొన్ని ఇంకా నెట్టింట వైరల్ అవుతున్నాయి. దీంతో తన తండ్రితో పాటు ఆరాధ్య నేరుగా హైకోర్టుని ఆశ్రయించడంతో గూగుల్‌కు మరోసారి న్యాయస్థానం నోటీసులు జారీ చేసింది. ప్రస్తుత పిటిషన్‌పై విచారణ మార్చి 17న జరగనుందని తెలిపింది. అభిషేక్ బచ్చన్, ఐశ్వర్య రాయ్ 2007లో వివాహం చేసుకున్నారు. వీరికి 2011 నవంబర్ 6న ఆరాధ్య జన్మించింది.

## సతీ లీలావతి వినోదం



లావణ్యా త్రిపాఠి టైటిల్ రోల్‌లో నటిస్తున్న చిత్రం 'సతీ లీలావతి'. మలయాళ నటుడు దేవ్ మోహన్ మరో లీడ్ రోల్ చేస్తున్నారు. తాతినేని సత్య దర్శకత్వంలో ఆనంది ఆర్ట్ క్రియేషన్స్ సమర్పణలో ఎమ్. నాగమోహన్ బాబు, టి.రాజేష్ నిర్మిస్తున్నారు. ఈ సినిమా ప్రారంభోత్సవం సోమవారం జరిగింది. ముహూర్తపు సన్నివేశానికి హీరో వరుణ్ తేజ్ కెమెరా స్విచ్చాన్ చేయగా, నిర్మాత హరీష్ పెద్ది క్లాప్ ఇచ్చారు. తొలి సన్నివేశానికి డైరెక్టర్ టీఎల్‌వీ ప్రసాద్ గౌరవ దర్శకత్వం వహించారు. తాతినేని సత్య మాట్లాడుతూ%–% "మనస్ఫూర్తిగా నవ్వుకునే రొమాంటిక్ డ్రామా 'సతీ లీలావతి'. అన్ని వర్గాల ప్రేక్షకులను మెప్పించే అంశాలతో తెరకెక్కుతోంది. సోమవారం నుంచే రెగ్యులర్ చిత్రీకరణ ప్రారంభిస్తున్నాం" అని తెలిపారు. "ఈ స్క్రిప్ట్ వినగానే నేటి తరం ఆడియన్స్కు కనెక్ట్ అయ్యేలా ఈ సినిమా ఉంటుందనిపించింది" అన్నారు నిర్మాతలు ఎమ్. నాగమోహన్ బాబు, టి. రాజేష్.



## నలుగురితో ప్రేమాయణం..

ఇండస్ట్రీలో కొన్ని పాత్రలు కొంతమంది నటులకే సెట్ అవుతాయి. ఆ పాత్రను చూడగానే పలానా నటుడు అయితేనే ఇలా చేయగలడు అనుకుంటాం. వారు తప్ప వేరేవాళ్లు ఆ పాత్రల్లో కనిపించినా.. అంతగా ఆకట్టుకోలేరు. ఐటమ్ సాంగ్ అనగానే అందరికి గుర్తొచ్చే పేరు ముమైత్ ఖాన్. గతంలో మన దగ్గర జయమాలిని, జ్యోతిలక్ష్మి, సిల్కి స్మిత లాంటి తారలు ప్రత్యేక పాటలతో అలరించినా.. కొన్నాళ్ల తర్వాత ఐటమ్ సాంగ్ హవా తగ్గిపోవడంతో వారంతా కనుమరుగైపోయారు. ఆ తర్వాత తెలుగులో అడపా దడపా స్పెసల్ సాంగ్స్ వచ్చినప్పుటికీ.. అంతగా ఆకట్టుకోలేదు. ఇక అంతరించిన పోతున్న ఐటమ్ సాంగ్స్‌కి ఊపు తెచ్చిన నటి ముమైత్ ఖాన్. పూరీ జగన్నాథ్ – సూపర్‌స్టార్ మహేశ్ బాబు కాంబినేషన్‌లో వచ్చిన పోకిరీలో స్పెషల్ సాంగ్ 'ఇప్పటికింకా నా వయసు నిండా పదహారే' ఎంత హిట్టయిందో అందరికి తెలిసిందే. దానికి యాభై శాతం మణిశర్మ మ్యూజిక్ కారణం అయితే.. మరో యాభై శాతం ముమైత్ వేసిన స్టెప్పులే. అప్పట్లో ఏ ఈవెంట్‌లో చూసినా ఈ పాటే మారుమోగిపోయేది. ఆ ఒక్క పాటతో ముమైత్ 'స్పెషల్ సాంగ్' స్పెషలిస్ట్‌గా మారిపోయింది. పోకిరి తర్వాత యోగి, ఆడవారి మాటలకు అర్థాలే వేరులే, బుజ్జిగాడు, మగధీర, కెవ్వు కేక తదితర సినిమాల్లో ఐటమ్ సాంగ్‌కి తనదైన శైలీలో స్టెప్పులేసి అలరించింది. పలు చిత్రాల్లో కీలకపాత్రలు పోషించి నటిగానూ మంచి మార్కులు కొట్టేశారు ముమైత్ ఖాన్. ఆ తర్వాత ఉన్నట్టుండి వెండితెరపై దూరమయ్యారు. కొన్నాళ్ల తర్వాత బిగ్‌బాస్ రియాల్టీ షోలో మెరిసింది.ఆ తర్వాత సినిమాల్లో కానీ బయట ఎక్కడ గాని కనిపించలేదు. రీసెంట్ ఈ ఐటమ్ భామ వరుస ఇంటర్వ్యూలో ఇస్తూ తన గురించి ఆసక్తికర విషయాలు చెబుతోంది. తనకు ఆ మధ్య పెద్ద యాక్సిడెంట్ అయ్యిందని, కోలుకోవడానికి టైం పట్టడంతో ఇంటికే పరిమితమైనట్లు చెప్పింది. అలాగే ప్రేమ పెళ్లి గురించి మాట్లాడుతూ.. గతంలో నలుగురితో డేటింగ్ చేశానని.. వారిలో తనకు ఒక్కరు కూడా కనెక్ట్ కాకపోవడంతో బ్రేకప్ చెప్పానని చెప్పింది. ప్రస్తుతం ఒంటరిగా హాయిగా జీవితాన్ని గడుపుతున్నానని, భవిష్యత్తులో పెళ్లి అనేది రాసుంటే ఖచ్చితంగా చేసుకుంటానని ముమైత్ చెప్పింది.






# చరిత్ర సృష్టించిన శివమ్ దూబే..

**ముంబైలోని వాంఖడే స్టేడియం వేదికగా ఇంగ్లండ్‌తో జరిగిన ఐదో టీ20లో భారత్ 150 పరుగుల తేడాతో ఘన విజయం సాధించిన సంగతి తెలిసిందే. ఈ మ్యాచ్‌లో అభిషేక్ శర్మతో పాటు శివమ్ దూబే కూడా ఆల్‌రౌండ్ షోతో అదరగొట్టాడు.**

తొలుత బ్యాటింగ్‌లో మెరుపు ఇన్నింగ్స్ (13 బంతుల్లో 30 పరుగులు) ఆడిన దూబే.. అనంతరం బౌలింగ్‌లో రెండు వికెట్లతో సత్తాచాటాడు. ఫిల్ సాల్ట్, జాకబ్ బెతల్ వంటి కీలక వికెట్లు పడగొట్టి భారత విజయంలో తనవంతు పాత్ర పోషించాడు. ఈ క్రమంలో దూబే ఓ అరుదైన రికార్డును తన ఖాతాలో వేసుకున్నాడు.

దూబే వరల్డ్ రికార్డు..

అంతర్జాతీయ టీ20ల్లో వరుసగా 30 విజయాలు సాధించిన జట్టులో భాగమైన తొలి క్రికెటర్‌గా దూబే వరల్డ్ రికార్డు సృష్టించాడు. దూబేకు భారత్ తరపున ఇది వరుసగా 30వ టీ20 విజయం కావడం గమనార్హం. దూబే తన కెరీర్‌లో టీమిండియా తరపున ఇప్పటివరకు 35 టీ20లు ఆడాడు. 2019లో ఢిల్లీ వేదికగా బంగ్లాదేశ్‌తో జరిగిన తొలి టీ20తో దూబే అంతర్జాతీయ క్రికెట్‌లోకి అడుగుపెట్టాడు.

ఈ మ్యాచ్‌లో భారత్ 7 వికెట్ల తేడాతో ఓడిపోయింది. ఆ తర్వాత అతడి ఐదో టీ20లో సైతం బంగ్లాదేశ్‌లో భారత్ ఓటమి చవిచూసింది. అప్పటి నుంచి దూబే ఆడిన ఏ టీ20 మ్యాచ్‌లోనూ టీమిండియా పరాజయం పాలవ్వలేదు. వరుసగా భారత్ 30 మ్యాచ్‌ల్లోనూ విజయం సాధించింది.

ఈ అరుదైన ఫీట్ సాధించిన దూబేకు ఐపీఎల్ ఫ్రాంచైజీ చెన్నై సూపర్ కింగ్స్ అభినందనలు తెలిపింది. "దూబే ఆడితే భారత్ గెలవాల్సిందే. దూబే ఆడిన 30 మ్యాచ్‌ల్లోనూ భారత్ వరుసగా విజయం సాధిచిందని సీఎస్‌కే ఎక్స్‌లో రాసుకొచ్చింది.

కాగా ఇంగ్లండ్‌తో టీ20లకు దూబేకు తొలుత భారత జట్టులో చోటు దక్కలేదు. నితీశ్ కుమార్ రెడ్డి గాయపడడంతో దూబే జట్టులోకి వచ్చాడు. పుణే వేదికగా జరిగిన నాలుగో టీ20తో తుది జట్టులోకి వచ్చిన దూబే.. అద్భుతమైన హాఫ్ సెంచరీతో చెలరేగాడు. ఆ మ్యాచ్‌లో కంకషన్‌కు గురికావడంతో బౌలింగ్ చేసే అవకాశం రాలేదు.

ఆఖరి టీ20లో మాత్రం తనకు వచ్చిన అవకాశాన్ని ఈ ముంబై ఆటగాడు అందిపుచ్చుకున్నాడు. కాగా టీ20 సిరీస్ ముగియడంతో దూబే ముంబై తరపున రంజీల్లో ఆడనున్నాడు. ఇక ఇది ఇలా ఉండగా.. భారత్-ఇంగ్లండ్ మధ్య మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్ నాగ్‌పూర్ వేదికగా ఫిబ్రవరి 6 నుంచి ప్రారంభం కానుంది.

జట్లుజి

భారత్: రోహిత్ శర్మ, శుభ్‌మన్ గిల్, విరాట్ కోహ్లి, శ్రేయస్ అయ్యర్, కేఎల్ రాహుల్, హార్దిక్ పాండ్యా, అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్, కుల్దీప్ యాదవ్, హర్షిత్ రాణా, జస్‌ప్రీత్ బుమ్రా, మహమ్మద్ షమీ, అర్ష్‌దీప్ సింగ్, యశస్వి జైస్వాల్, రిషభ్ పంత్, రవీంద్ర జడేజా

ఇంగ్లండ్: హ్యారీ బ్రూక్, బెన్ డకెట్, జోరూట్, జాకోబ్ బెతెల్, లియామ్ లివింగ్‌స్టోన్, బ్రైడన్ కార్స్, జేమీ ఓవర్టన్, జోస్ బట్లర్, జేమీ స్మిత్, ఫిలిప్ సాల్ట్, జోఫ్రా ఆర్చర్, గస్ అట్కిన్సన్, ఆదిల్ రషీద్, సకీబ్ మహ్మూద్, మార్క్ వుడ్.



## 'నేనూ.. మావారు'

### క్లాసిక్ కాంజీవరం చీరలో పీవీ సింధు

భారత బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పీవీ సిందులో మరోసారి తన ఎటైర్‌తో అందర్నీ ఆకర్షించింది. సింధు కోర్టులో మెరుపు షాట్లతో అబ్బుర పర్చడంమాత్రమే కాదు, తనదైన శైలి ఫ్యాషన్‌తో అందమైన చీర కట్టుతో ఆకట్టుకుంది. 'మీ అండ్ మైన్' అంటూ ఇన్‌స్టాలో ఒక ఫోటోను పోస్ట్ చేసింది. దీంతో అభిమానులను ఆమె లుక్‌కి ఫిదా అవుతూ కామెంట్స్‌పెట్టారు. ఫ్రెండ్ పెళ్లికి వెళ్లిన పీవీ సింధు క్లాసిక్ ఇండియన్ కాంజీవరం చీరలో అద్భుతంగా కనిపించింది. అందమైన బిగ్ జరీ బోర్డ్ పట్టుచీరలో నవ్వుతూ యువరాణిలా కనిపించింది. చీర అంతా తెల్లటి ఎంబ్రాయిడరీ అందంగా కనిపిస్తోంది. దీనికి జతగా మల్టీ లేయర్ నెక్లెస్, మ్యాచింగ్ చెవిపోగులతో తన లుక్ ను మరింత ఎలివేట్ చేసుకుంది. మృదువైన కర్ల్స్‌లో స్టైల్ చేసి అలా వదిలేసింది.

వెంకట దత్త సాయి విషయానికొస్తే, అతను తెల్లటి కుర్తా-పైజామా సెట్‌లో ఎప్పటిలాగానే మెరిసిపోయాడు. తన లుక్‌ను మరింతగా పెంచుతూ,పీచ్-హ్యాండ్ఎంబ్రాయిడరీ జాకెట్ ధరించాడు. ఇంకా గోల్డెన్ ఎంబ్రాయిడరీ, బటన్స్ జాకెట్‌కు ట్రెండీ స్టైల్‌ను జోడించాయి. కాగా రెండుసార్లు ఒలింపియన్ అయిన సింధు గత సంవత్సరం డిసెంబర్‌లో వ్యాపారవేత్త వెంకట దత్త సాయిని వివాహం చేసుకుంది. అంగరంగ వైభవంగా జరిగిన ఈ వేడుకల్లో ప్రతీది ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మెహిందీ, సంగీత్ వేడుకల్లో అందంగాముస్తాబై, ఫ్యాషన్ ప్రియులు కూడా ఆశ్చర్యపోయేలా చేశారు. సమయానికి తగ్గట్టుఅద్భుతమైన సాంప్రదాయ దుస్తులతో ఈ జంట అందరి దృష్టిని తమవైపు తిప్పుకున్నారు. మ్యాచింగ్ డైమండ్ ఆభరణాలతో పీవీ సింధు కొత్త ట్రెండ్‌ను క్రియేట్ చేసింది.

## ఫుట్‌బాల్ చరిత్రలోనే నేను అత్యుత్తమ ఆటగాడిని: రొనాల్డో

**దాదాపు దశాబ్ద కాలానికి పైగా ఫుట్‌బాల్ ప్రపంచంలో మకుటం లేని మహారాజులుగా వెలుగొందుతున్నారు పోర్చుగల్ దిగ్గజం క్రిస్టియానో రొనాల్డో అర్జెంటీనా లెజెండ్ లియోనల్ మెస్సీ. అద్భుతమైన ఆట తీరుతో ఆకట్టుకునే ఈ ఇద్దరికీ ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది మంది అభిమానులు ఉన్నారు. అయితే, ఈ వీళ్లిద్దరిలో ఎవరు గొప్ప అన్న చర్చ ఎప్పుడూ ఆసక్తికరమే.**



ఈ విషయంపై రొనాల్డో స్వయంగా స్పందించాడు. చాలా మంది మెస్సీకే గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్ బిరుదు ఇచ్చేందుకు మొగ్గుచూపవచ్చని అభిప్రాయపడ్డాడు. అయితే, తాను మాత్రం పరిపూర్ణ ఫుట్‌బాలర్‌ని అని పేర్కొన్న రొనాల్డో.. ఫుట్‌బాల్ చరిత్రలో తన కంటే గొప్ప ఆటగాడు లేడని అనడం విశేషం.

నేనే 'కంప్లీట్ ప్లేయర్'

స్పానిష్ మీడియా అవుట్‌లెట్ లాసెక్టా టీవీకి తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూలో క్రిస్టియానో రొనాల్డో మాట్లాడుతూ.. "నాలాగా ప్రపంచంలో పరిపూర్ణమైన ఫుట్‌బాలర్ మరెవరూ లేరని అనుకుంటా. ఇప్పటి వరకు ఉన్న ఫుట్‌బాల్ ఆటగాళ్లందరిలో నేనే 'కంప్లీట్ ప్లేయర్'. నేను అ□న్ని రకాలుగా ఫుట్‌బాల్ ఆడగలను. చాలా మంది మెస్సీ, మారడోనా లేదంటే.. పీలే పేరు చెప్తారేమో!

చరిత్రలోనే అత్యుత్తమ ఆటగాడిని

వాళ్ల అభిప్రాయాన్ని నేను గౌరవిస్తాను. ఏదేమైనా మోస్ట్ కంప్లీట్ ప్లేయర్ మాత్రం నేనే! ఫుట్‌బాల్ చరిత్రలోనే నేను అత్యుత్తమ ఆటగాడిని. నా కంటే మెరుగ్గా ఆడే ఫుట్‌బాలర్‌ను ఇంత వరకూ చూడలేదు. ఇవి నా మనస్ఫూర్తిగా చెబుతున్న మాటలు" అని పేర్కొన్నాడు.

అదే విధంగా మెస్సీతో తన అనుబంధం గురించి చెబుతూ.. "మెస్సీతో నాకు ఎప్పుడూ ఎలాంటి సమస్యా లేదు. గత పదిహేనేళ్లుగా మేము అవార్డులు పంచుకుంటున్నాం. మా మాధ్య ఎలాంటి గొడవలు లేవు. అంతా సవ్యంగానే ఉంది.

తనకోసం నేను ఆంగ్లాన్ని తర్జుమా చేసిన సందర్భాలు ఉన్నాయి. అప్పట్లో భలే సరదాగా ఉండేవాళ్లం. ఇక ఆటగాళ్లుగా మేము ప్రత్యర్థులమే కదా. తను తన క్లబ్‌కి, నేను నా క్లబ్‌కి మద్దతుగా ఉంటాం. జాతీయ జట్ల విషయంలోనూ అంతే.

అయితే, ఆటతీరు ఎలా ఉందన్న అంశంపై పరస్పరం చర్చించుకుంటూ.. ఫీడ్‌బ్యాక్ తీసుకుంటాం. మా మధ్య ఎల్లప్పుడూ ఆరోగ్యకరమైన పోటీయే ఉంటుంది" అని రొనాల్డో తెలిపాడు.



## గొంగడి త్రిషకు ఘన స్వాగతం..

మహిళల అండర్-19 టీ20 ప్రపంచకప్‌లో తెలుగు అమ్మాయి గొంగడి త్రిష అద్భుతమైన ప్రదర్శన కనబరిచిన సంగతి తెలిసిందే. తన ఆల్‌రౌండ్ ప్రదర్శనతో భారత్‌కు వరుసగా రెండోసారి వరల్డ్‌కప్ టైటిల్‌ను త్రిష అందించింది. ఏడు ఇన్నింగ్స్‌లలో 309 పరుగులు చేసి ప్లేయర్ ఆఫ్‌ది టోర్నీగా త్రిష నిలిచింది. అంతేకాకుండా బౌలింగ్‌లోనూ తొమ్మిది వికెట్లతో త్రిష సత్తా చాటింది. ఇక భారత్ వరల్డ్‌కప్‌ను సొంతం చేసుకోవడంలో కీలక పాత్ర పోషించిన త్రిష సోమవారం అర్ధ రాత్రి హైదరాబాద్‌లోని శంషాబాద్ ఎయిర్ పోర్టులో అడుగుపెట్టింది. స్వదేశానికి చేరుకున్న త్రిషకు హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) అధ్యక్షుడు జగన్మోహన్ రావు ఘన స్వాగతం పలికారు. త్రిషతో పాటు ద్రితి కేసరి,టీమ్ హెడ్ కోచ్ నూసిన్, ఫిట్నెస్ ట్రైనర్ శాలిని కూడా తమ హైదరాబాద్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా మీడియాతో త్రిష మాట్లాడారు.

## ఇంగ్లండ్‌తో వన్డే సిరీస్.. రోహిత్ శర్మ ముందు భారీ రికార్డు

ఇంగ్లండ్‌తో వన్డే సిరీస్‌కు ముందు టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మను ఓ భారీ రికార్డు ఊరిస్తుంది. ఈ సిరీస్‌లో హిట్‌మ్యాన్ మరో 134 పరుగులు చేస్తే, విరాట్ కోహ్లి తర్వాత వన్డేల్లో అత్యంత వేగంగా 11,000 పరుగులు పూర్తి చేసిన ఆటగాడిగా రికార్డుల్లోకెక్కుతాడు. ఈ రికార్డు సాధించేందుకు రోహిత్‌కు మరో 19 ఇన్నింగ్స్‌ల సమయం ఉంది.

ప్రస్తుతం రోహిత్ 257 వన్డే ఇన్నింగ్స్‌ల్లో 31 సెంచరీలు, 57 అర్ధ సెంచరీల సాయంతో 10866 పరుగులు చేశాడు. విరాట్ వన్డేల్లో 11,000 పరుగులను 222 ఇన్నింగ్స్‌ల్లోనే పూర్తి చేశాడు.



వన్డేల్లో వేగంగా 11,000 పరుగులు పూర్తి చేసిన ఆటగాళ్ల జాబితాలో విరాట్ తర్వాతి స్థానంలో సచిన్ టెండూల్కర్ ఉన్నాడు. సచిన్ 276 ఇన్నింగ్స్‌ల్లో ఈ మైలురాయిని అధిగమించాడు. రోహిత్ మరో 19 ఇన్నింగ్స్‌ల్లో 134 పరుగులు చేస్తే సచిన్‌ను వెనక్కు నెట్టి విరాట్ తర్వాతి స్థానాన్ని ఆక్రమిస్తాడు.

కాగా, ఇంగ్లండ్‌తో వన్డే సిరీస్‌తో రోహిత్ శర్మ ఈ ఏడాది తొలిసారి టీమిండియా తరపున బరిలోకి దిగనున్నాడు. జనవరి ప్రారంభంలో ఆస్ట్రేలియాతో జరిగిన టెస్ట్ మ్యాచ్‌లో రోహిత్ బరిలోకి దిగలేదు. ఫామ్‌లేమి కారణంగా రోహిత్ వాలంటీర్‌గా ఆ మ్యాచ్ నుంచి తప్పుకున్నాడు.

అనంతరం ఈ ఏడాది భారత్ ఇంగ్లండ్‌తో టీ20 సిరీస్ ఆడింది. గతేడాది టీ20 వరల్డ్‌కప్ అనంతరం రోహిత్ పొట్టి ఫార్మాట్‌కు రిటైర్మెంట్ ప్రకటించడంతో ఈ సిరీస్‌లో ఆడలేదు. ఈ ఏడాది ఫిబ్రవరి 6న ఇంగ్లండ్‌తో జరుగబోయే తొలి వన్డే రోహిత్‌కు ఈ ఏడాది భారత్ తరపున తొలి మ్యాచ్ అవుతుంది.

రంజీల్లోనూ నిరాశే

ఇంగ్లండ్‌తో టీ20 సిరీస్ జరిగే సమయంలో రోహిత్ రంజీ బరిలోకి దిగాడు. ఖాళీగా ఉన్న సమయంలో టీమిండియా క్రికెటర్లంతా రంజీల్లో ఆడాలని బీసీసీఐ అల్టిమేటం జారీ చేసిన విషయం తెలిసిందే. సుదీర్ఘ విరామం అనంతరం రంజీ మ్యాచ్ ఆడిన రోహిత్ ఘోరంగా విఫలమయ్యాడు. గతేడాది నుంచి పెద్దగా ఫామ్‌లో లేని రోహిత్ రంజీ మ్యాచ్‌తో అయినా తిరిగి టచ్‌లోకి రావాలని భావించాడు. కానీ రోహిత్‌కు అక్కడ కూడా నిరాశే ఎదురైంది.

ఫిబ్రవరి 6 నుంచి మొదలు

ఇంగ్లండ్‌తో మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్ ఫిబ్రవరి 6 నుంచి మొదలవుతుంది. తొలి మ్యాచ్ నాగ్‌పూర్ వేదికగా జరుగనుంది. అనంతరం ఫిబ్రవరి 9, 12 తేదీల్లో రెండు, మూడు వన్డేలు జరుగనున్నాయి. ఈ మ్యాచ్‌లను కటక్, అహ్మదాబాద్ వేదిక కానుంది. ఈ మూడు మ్యాచ్‌లు మధ్యాహ్నం 1:30 గంటల నుంచి ప్రారంభమవుతాయి.

చిత్తుగా ఓడిన ఇంగ్లండ్

వన్డే సిరీస్‌కు ముందు ఇంగ్లండ్ భారత్‌తో ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్ ఆడింది. ఈ సిరీస్‌ను టీమిండియా 4-1 తేడాతో కైవసం చేసుకుంది. తాజాగా ముగిసిన చివరి టీ20లో భారత్ 150 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో అభిషేక్ శర్మ విధ్వంసకర శతకంతో విరుచుకుపడ్డాడు.